PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 273 | విజయవాడ, మంగళవారం 6 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 6 May 2025 | Rs



వడ్డీ రేట్లు 1.25 శాతం తగ్గించొచ్చు

- రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం
- ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా

3

సన్‌రైజర్స్‌కు వర్షం దెబ్బ

- ఛేదనలో హైదరాబాద్ ఇన్నింగ్స్‌కు అడ్డంకి
- ఇరుజట్లకు చెరో పాయింట్



8

నేటి సాయంత్రంలోగా పరిహారం

అకాల వర్షాలపై సమీక్షలో సిఎం ఆదేశం • ప్రతి రైతునూ ఆదుకుంటామని వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు, పిడుగుపాటుకు గురై మృతి చెందిన వారి కుటుంబాలకు నేటి (మంగళవారం) సాయంత్రంలోగా పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఉన్నత స్థాయి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిహారం చెల్లించడంలో జాప్యం ఉండకూడదని, తక్షణమే చెల్లించాలని చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు.అనంతరం సిఎం మాట్లాడుతూ అనేక జిల్లాలకు అకాల వర్షాలు ఉన్నందున కలెక్టర్లు రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో రైతులకు మెసేజ్‌లు వెళ్లని పక్షంలో అధికారులు నేరుగా వెళ్లి అప్రమత్తం చేయాలని తెలిపారు. జిల్లాల్లో ఉన్న పరిస్థితులను బట్టి కలెక్టర్లు, దిగువ స్థాయి అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. విపత్తు సమయాల్లో అధికారులు మానవీయ కోణంలో ఆలోచించాలని, సహాయక చర్యలతోపాటు ఎటు వంటి నష్టమూ వాటిల్లకుండా చూడాలని అన్నారు. రాబోయే రోజుల్లో ఆర్‌టిజిఎస్‌లోని అవేర్ విభాగం నుండి ఎప్పటికప్పుడు వాతావరణం గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతికత ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకో వాలని తెలిపారు. అధికారులు ఎంత అప్రమత్తంగా ఉంటే నష్టం అంత తక్కువగా జరుగు తుందని వివరించారు. అకాల వర్షాలకు ఆయా జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను తక్షణం పునరుద్ధరించడం లో కృషి చేసిన విద్యుత్‌శాఖ సిబ్బందిని సిఎం అభినందించారు. రబీలో 20 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల ప్రత్యేక కార్యదర్శి సౌరబ్‌గౌర్ సిఎంకు తెలపగా ఎక్కడా ధాన్యం కొనలేదనే మాటరాకూడదని తెలిపారు. జిల్లా కలెక్టర్లు కూడా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని మరణాలు సంభవించకుండా చూడాలని పేర్కొన్నారు.



కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

నష్టం ఎంతంటే...!

2224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బ తిన్నట్లు ఈ సమావేశంలో అధికారులు సిఎంకు వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 15 మండలాల్లో 1033, నంధ్యాల జిల్లాలో 641, కాకినాడ జిల్లాలో 350, సత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరి పంట దెబ్బతిందని తెలిపారు. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్‌టిఆర్, తిరుపతి, నంధ్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 138 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అధికారులు సిఎంకు వివరించారు.

భారీ వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

- సిపిఎం డిమాండ్

2

ప్రసూతి సెలవుల్లో.. 'ఇద్దరు పిల్లల' నిబంధన తొలగింపు

- ఆర్థికశాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



మహిళా ఉద్యోగులకు ఇచ్చే ప్రసూతి సెలవులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఇద్దరు పిల్లలలోపు మాత్రమే 180 రోజుల సెలవులను ఇస్తుండగా, తాజాగా ఆ ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో 120 రోజులుగా ఉన్న ఈ సెలవులను 180 రోజులకు పెంచుతూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే తల్లిదండ్రులపై ఆధారపడే ఇద్దరు పిల్లలకు మాత్రమే ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. తాజాగా ఈ ఉత్తర్వులను సవరిస్తూ కనీస పిల్లలు అన్నది తొలగించాలని నిర్ణయించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో జనాభా వృద్ధి ఆశించిన స్థాయిలో లేదని రాష్ట్ర ముఖ్యమంత్రే నేరుగా చెబుతున్న సంగతి తెలిసిందే. అందుకే తాజాగా జనాభా పెంచాలన్న విధానాన్ని తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలకు ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగానే పలు రంగాల నిపుణులు, ప్రముఖుల నుంచి సూచనలు సలహాలు సేకరిస్తోంది. ఈ సూచనలకు అనుగుణంగానే తాజాగా విద్యార్థులకు ఇచ్చే సాయాన్ని కూడా కుటుంబంలో ఒక్కరికే కాకుండా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జనాభాను పెంచేందుకు మరిన్ని ప్రోత్సాహకాలపైనా కసరత్తు చేస్తామని కూడా చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగానే తాజాగా పిల్లలను సంరక్షించుకునేందుకు ఇస్తున్న ప్రసూతి సెలవుల్లోనూ ఇద్దరు పిల్లలకు మాత్రమే అన్న నిబంధన తొలగించడం గమనార్హం.

కొత్త సిజెఐకు వక్ఫ్ కేసు

తప్పకున్న సిజెఐ ఖన్నా • 15వ తేదీకి విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ నుండి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తప్పుకున్నారు. సోమవారం ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ, ఈ నెల 13న తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలనుకోవడం లేదని లేదా రిజర్వ్ చేయాలని కూడా అనుకోవడం లేదని అన్నారు. ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తున్న పిటిషన్లపై తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతుందని చెప్పారు. విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు. ఈ అంశంపై వివరణాత్మక పరిశీలన అవసరమైనందున ఈ దశలో తాను మధ్యంతర ఉత్తర్వులివ్వలేనని చెప్పారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఇప్పటివరకు 72 పిటిషన్లు దాఖలయ్యాయి. ఇప్పటికే ఈ కేసును సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. ఏప్రిల్ 17న సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రప్రభుత్వ విజ్ఞప్తి మేరకు మే 5కి కేసు వాయిదా వేసింది. విచారణ సమయంలో చట్టంలోని రెండు వివాదాస్పద నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని కేంద్రం తెలిపింది. అలాగే, వక్ఫ్ కౌన్సిల్, బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించొద్దని కేంద్రాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. అన్ని రకాలుగా జాగ్రత్తగా పరిశీలించిన తరువాతే వక్ఫ్ సవరణ చట్టం రూపొందించినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. పూర్తిస్థాయిలో సమాధానం ఇచ్చేందుకు కోర్టును గడువు కోరారు. ఈ మేరకు కేంద్రం వారం రోజులు గడువు ఇస్తూ కేసు విచారణను మే 5కి వాయిదా వేసింది.

ఈ సందర్భంగా వక్ఫ్‌గా న్యాయస్థానాలు ప్రకటించిన ఆస్తులను ప్రస్తుతానికి వక్ఫ్ జాబితా నుంచి తొలగించొద్దని, వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ మండలిలో ఎక్స్-అఫీషియో సభ్యులు మినహా మిగతా సభ్యులంతా కచ్చితంగా ముస్లింలే వుండాలని కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

'వక్ఫ్' సవరణ ఒక కుట్ర

- కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి : బృందాకరత్
- రాజ్యాంగ విరుద్ధం : డి.రాజా
- కర్ణాటకలో కులమతాలకు అతీతంగా భారీ నిరసన

7

యాక్సిస్ ఒప్పందం రద్దు చేయండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యూనిట్ విద్యుత్‌ను రూ.4.60 పైసలు చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కమ్‌లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలపై పాతికేళ్లపాటు రూ.15 వేల కోట్ల భారం వేసే ఒప్పందాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆమోదముద్ర వేయడం అన్యాయమని తెలిపారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003లోని 108వ సెక్షన్‌ను ప్రయోగించడం గర్హనీయమని పేర్కొన్నారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుండి విద్యుత్‌ను యూనిట్‌కు రూ.4.60 చొప్పున కొనుగోలు చేసేందుకు ఎపిఎస్‌పిడిసిఎల్ చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదిస్తూ ఎపిఇఆర్‌సి శనివారం జారీ చేసిన ఉత్తర్వులను ఆయన ప్రస్తావించారు. పాతికేళ్ల పాటు 400 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ద్వారా యాక్సిస్ కంపెనీకి రూ.15 వేల కోట్లకుపైగా లబ్ధికలుగుతుందని, గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడే 2018లో ఈ దోపిడీకి ప్రయత్నించగా ప్రభుత్వం మారిన తరువాత కోర్టుల చుట్టూ తిరిగిందని తెలిపారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక యాక్సిస్ కంపెనీ పాత ప్రతిపాదనను డిస్కమ్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 108 కింద రిఫర్ చేయడం ద్వారా ఎపిఇఆర్‌సి కూడా ఆమోదముద్ర వేయాల్సిన తప్పనిసరి పరిస్థితిని కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపి యాక్సిస్ కంపెనీకి కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం చేయించిన ఈ ఒప్పందం ఎంతమాత్రమూ ఆమోదించరానిదని తెలిపారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో యూనిట్ రూ.2, రూ.2.50పైసలకు ఒప్పందాలు జరుగుతున్నాయని వివరించారు. గతంలో అదానీ సెకీ ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.49పైసలకు ఒప్పందం చేసుకోగా అది అధికరేటని తెలుగుదేశంతో సహా అన్ని పక్షాలూ విమర్శించాయని, నేడు దానికంటే, రూ.2.10పైసల కు అధికంగా ఒప్పందం చేసుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. సోలార్ ప్యానెల్స్, ఇతర ఉత్పాదకాల ఖర్చు భవిష్యత్‌లో ఇంకా తగ్గే వీలున్నందున విద్యుత్ రేట్లు ఇంకా తగ్గుతాయని, ఆ ప్రయోజనం కూడా వినియోగదారులకు దక్కకుండా రూ.4.60పైసల రేటుకు పాతికేళ్లు కొనసాగేలా యాక్సిస్‌తో ఒప్పందం చేయడం దారుణమన్నారు. అన్ని విధాలా నష్టదాయకమైన ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని, అందుకోసం ప్రజలు, విద్యుత్ వినియోగదారులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, నిరసన తెలపాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి వేతనదారులకు పరిహారం పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో పని ప్రదేశంలో జరిగిన ప్రమాదాల్లో గాయాలపాలైన, మరణించిన వేతనదారులకు అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు 2006 జులై 29న ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు 303కు సవరణలు చేశారు. ఈ ఉత్తర్వుల్లో ప్రమాదంలో గాయాల వల్ల శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే చెల్లించే నష్టపరిహారాన్ని రూ.25 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ సవరణ చేశారు. పూర్తిగా పక్షవాతం సంభవించి కదల్లేని స్థితికి వెళితే చెల్లించే పరిహారం రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచుతూ, పని ప్రదేశంలో ప్రమాదాల్లో 6 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు శాశ్వత అంగవైకల్యాన్ని పొందితే చెల్లించే పరిహారాన్ని రూ.25 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ ఉత్తర్వులను సవరించారు. పని ప్రదేశంలో వేతనదారులు లేక పిల్లలు మరణిస్తే వారికి చెల్లించే రూ.50 వేల ఎక్స్‌గ్రేషియోను రూ.2 లక్షలకు పెంచుతూ సవరణ చేశారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

ఏడుగురు అధికారుల సస్పెన్షన్

- కాంట్రాక్టర్ సహా ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలకు ఆదేశం
- సింహాచలం ఘటనపై త్రిసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని సింహాచలంలో సింహాద్రి అప్పన్న కొండపై చందనోత్సవం సందర్భంగా జరిగిన విషాద ఘటనకు బాధ్యులను చేస్తూ ఏడుగురు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టింది. కాంట్రాక్టర్ సహా ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యకు ఆదేశించింది. గత నెల 30న సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడడం, ఈ ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిషన్‌ను నియమించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు సింహాచలంలో ఈ కమిషన్ విచారణ జరిపింది. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సహా వివిధ సాక్షుల నుంచి పలు స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సోమవారం అందజేసింది. గోడ పటిష్టత, భక్తుల భద్రతను దేవస్థానం అధికారులు గాలికొదిలేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించింది. చంద్రబాబును కమిషన్ చైర్మన్, పురపాలక శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ కలిసి సింహాచలం ప్రమాద పరిస్థితులను వివరించారు. తాత్కాలికంగా నిర్మించిన గోడకు పునాది లేదని ప్రాథమికంగా తేలిందన్నారు. భారీ వర్షం రావడంతో పెద్ద ఎత్తున నీరు, బురద చేరి గోడకు దిగువన గండి కొట్టేసి గోడ కూలిపోయినట్లు వెల్లడించారు. చందనోత్సవానికి వారం రోజుల ముందు ఈ గోడను హడావుడిగా నిర్మించినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. ప్రసాద్ స్కీంలో భాగంగా గోడ నిర్మాణానికి హడావుడిగా అనుమతులు ఇచ్చారని నివేదికలో పొందుపర్చారు. గోడ నిర్మాణానికి ఎలాంటి డిజైన్‌లూ, పునాది లేకపోవడంతో ఇంత విపత్తు చోటుచేసుకున్నట్లు వివరించినట్లు తెలిసింది. ఈ ఘటన విషయంలో ఆలయ ఇఒను ప్రధాన కారకునిగా నివేదికలో పొందుపరిచారు. సింహాచలం దేవాదాయ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, టూరిజం కార్పొరేషన్ అధికారులను,, కాంట్రాక్టర్ లక్ష్మణరావును బాధ్యులుగా నివేదికలో పేర్కొంటూ వీరందరిపైనా తీవ్ర చర్యలకు త్రిసభ్య కమిషన్ సిఫారసు చేసింది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సింహాచలం దేవస్థానం ఇఒ కె సుబ్బారావు, ఇఇ డి.జి.శ్రీనివాసరాజు, డిప్యూటీ ఇఇ కెఎస్‌ఎన్ మూర్తి, జెఇ కె.బాబ్జీ, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఇఇ కె.రమణ, డిప్యూటీ ఇఇ ఎవివిఎల్‌ఆర్.స్వామి, ఎఇ పి మదన్‌మోహన్,లపై సస్పెన్షన్ వేటు వేసింది. కాంట్రాక్టర్ కె.లక్ష్మీనారాయణను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు ఆయనపైనా, సింహాచలం దేవస్థానం ఇఒ కె.సుబ్బారావు, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ఇఇ కె.రమణపైనా క్రిమినల్ చర్యలకు ఆదేశాలు జారీ చేసింది.



గోడ కూలిన ప్రాంతంలో పోలీసుల సహాయక చర్యలు (ఫైల్)

రాజమహేంద్రవరం మున్సిపాలిటీ అధికారులకు వారెంట్లు

ప్రజాశక్తి-అమరావతి

కోర్టు ధిక్కార కేసులో రాజమహేంద్రవరం మున్సిపల్ అధికారులకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. కేసులో నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటీసులపై స్పందించకపోవడం కనీసం న్యాయవాదిని నియమించకపోవడంతో అప్పటి రాజ మహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ డి దినేష్ కుమార్, సిటీ ప్లానర్ జివిఎస్ఎన్ మూర్తి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టిఎస్ అనితకు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 18కి వాయిదా వేస్తూ జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏ విధమైన పరిహారమూ చెల్లించకుండానే తమ స్థలాన్ని స్వాధీనం చేసుకు న్నారంటూ కె.బల రామకృష్ణ సహా ఐదుగురు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు 8 వారాల్లో టిడిఆర్ బాండ్ ఇవ్వాలని మున్సిపల్ అధికారులను 2023లో హైకోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులు అమలు కాలేదంటూ కె పూర్ణ గంగా భవాని గతేడాది హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా విచారణ జరిపిన హైకోర్టు కౌంటర్ దాఖలుచేయాలని దినేష్ కుమార్, మూర్తి, టిఎస్ అనితను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆ తర్వాత కోర్టు వారికి నోటీసులు జారీ చేసింది.

పోలవరం ప్రాజెక్టుకు విదేశీ నిపుణుల బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో సోమవారం విదేశీ నిపుణుల బృందం పర్యటించింది. ఉదయమే ప్రాజెక్టుకు చేరుకున్న అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొనెల్లీ, సీన్ హించ్ బెర్గర్, జియాన్ ఫ్రాంకో డి సికో, డేవిడ్ బి పాల్ బృందం తొలుత ప్రాజెక్టు సమావేశపు కార్యాలయంలో జలవనరులశాఖ ఇంజనీర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించింది. అనంతరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతంలో పనులను, ఎగువ కాఫర్ డ్యాం సిపేజీ నివారణకు నిర్మిస్తున్న బట్రస్ డ్యాం పనులను బృందం సభ్యులు పరిశీలించారు. డయాఫ్రం వాల్ నిర్మాణ పనుల్లో భూమి పటిష్టత కోసం జరుగుతున్న పనుల తీరు, ఎగువ కాఫర్ డ్యాం, సిపేజ్ నివారణకు చేపట్టిన బట్రస్ డ్యాం నిర్మాణంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, ఎగువ కాఫర్ డ్యాం పటిష్టతకు చేపట్టిన పనులను పరిశీలించి సంబంధిత వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజక్టు సిఇ కె నరసింహమూర్తి, మెగా కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీష్‌బాబు, బావర్ కంపెనీ ప్రతినిధి హసన్ పనుల వివరాలను విదేశీ నిపుణుల బృందానికి తెలియజేశారు. ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు సరబ్జెత్ సింగ్ భక్షి, రాకేష్తోతేజ, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, కేంద్ర మట్టి రాతి నాణ్యతా పరిశీలన కేంద్రం అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పాల్గొన్నారు.



డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతంలో పరిశీలిస్తున్న విదేశీ నిపుణుల బృందం

20 నుంచి 22 వరకు మున్సిపల్ సమ్మె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేది నుండి 22వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) సమ్మె నోటీసు అందచేసింది. తాడేపల్లిలోని డిఎంఎ కార్యాలయంలో డిఎంఎ పి.సంపత్ కుమార్‌ను ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సహా పలువురు రాష్ట్ర నాయకులు సోమవారం కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఈ నెల 20 వతేదిన , స్థానిక సమస్యల పరిష్కారం 21,22 తేదీలలో సమ్మె నిర్వహించనున్నట్లు ఈ నోటీసులో పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ రద్దుతోపాటు రాష్ట్రంలో ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని, మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో ఫెడరేషన్ కార్యదర్శి బి.ముత్యాలరావు, రాష్ట్ర నాయకులు టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మీ, ఎస్.దాసు తదితరులు ఉన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు

స్పెషల్ డిఎస్‌సిపై కేబినెట్‌లో చర్చిస్తాం

- గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి హామీ
- సానుకూల నిర్ణయం రాకపోతే 9న భవిష్యత్తు కార్యాచరణ : ఆదివాసీ నాయకులు

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

ఈ నెల 8న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు స్పెషల్ డిఎస్‌సిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ నాయకులకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. దీనిపై నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలకు మేలు చేసే విధంగా సానుకూల నిర్ణయం వచ్చేలా చూడాలని ఆమెను కోరారు. ఏజెన్సీ ప్రాంత స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ ఈ నెల 2న రాష్ట్ర వ్యాప్త ఏజెన్సీ బంద్ నిర్వహించిన నేపథ్యంలో చర్చలకు రావాలని నాయకులను పాడేరు కలెక్టర్ ద్వారా మంత్రి సంధ్యారాణి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో నాయకులు కిల్లో సురేంద్ర పి.అప్పలనర్స, ఎస్.మాణిక్యం, శాంతకుమారి, కె.రాధాకృష్ణ, కాంతారావు, ఆర్.జగన్ మిగతా 7లో

సోషలిజానిదే భవిష్యత్

- మార్క్స్ జయంతి సభలో వక్తలు
- సామ్రాజ్యవాదంపై పోరాటమే మార్క్స్‌కు నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆటుపోట్లు ఎన్ని ఎదురైనప్పటికీ సోషలిజానిదే భవిష్యత్ అని పలువురు వక్తలు అన్నారు. కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా హనుమాన్‌పేటలో మార్క్స్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యాన సోమవారం నివాళులర్పించారు.ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణమాలు సోషలిజందే అంతిమ విజయమన్న విషయాన్ని ధృవీకరిస్తున్నాయని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికవర్గం హక్కుల కోసం పోరాడుతోందని, మే 20న సమ్మెకు సన్నద్ధం అవుతోందని తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదం పేరుతో కార్మికులను, ప్రజలను చీలుస్తోందని విమర్శించారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో కులగణన ప్రకటించారని, గతంలో ఇదే మోడీ కులగణన దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, బలహీన పరుస్తుందని, అర్బన్ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు బీహార్ ఎన్నికల కోసం కులగణన ప్రకటించారంటే రాజకీయంగా వారి వాదన ఎలా దివాళా తీసిందో అర్థమవుతుందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ మైనింగ్ కార్పొరేట్లను ప్రోత్సహించేందుకు తప్ప మరొకటి కాదని అన్నారు. దీనిపై మోడీ,అమిత్‌షాలు చేస్తున్న వాదనల్లో పసలేదని చెప్పారు. మరోవైపు అమెరికా అధ్యక్షులుగా ట్రంప్ ఎన్నికైన తర్వాత సుంకాలు భారీగా పెంచడం ఆర్థిక సంక్షోభానికి దారి తీసిందన్నారు.

అమెరికా గుండెల్లో చైనా సింహస్వప్నంగా ఉందన్నారు. మార్క్స్ సిద్ధాంత స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం బిజెపికి అలవాటుగా మారిందని, చివరకు పహల్గాం ఉగ్రదాడి ఘటనను సైతం ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకునేందుకు దిగజారిందని అన్నారు. ఇలాంటి సమయంలో దేశ సమైక్యతను చాటేందుకు ప్రతిఒక్కరూ కదిలిరావాలని కోరారు. ఇజ్రాయిల్-పాలస్తీనా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వెనక సామ్రాజ్యవాద దేశాల కుట్రలు ఉన్నాయన్నారు. సమాజంలో అందరికీ తిండి, ఇళ్లు, బట్ట వంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. న్యూ డెమోక్రసీ నాయకులు పోలారి, హక్కుల ఉద్యమ నాయకులు భాస్కరరావు మాట్లాడుతూ.. దేశంలో బిజెపిని గద్దె దించాలంటే కమ్యూనిస్టులందరూ ఒకే వేదిక మీదకు రావాలని ఆకాంక్షించారు. తొలుత ప్రజా నాట్యమండలి నాయకులు నజీర్ ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, విజయవాడ కార్పొరేషన్‌లో సిపిఎం ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ సత్తిబాబు, సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మార్క్స్ జయంతి సభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో రామకృష్ణ తదితరులు



కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు

- సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే..
- ఆర్‌టిజిఎస్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండకూడదని, ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్లో అందేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కార్యకలాపాలపై వెలగపూడి సచివాలయంలో సిఎం సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే ప్రజలు ప్రభుత్వం నుండి అన్ని సేవలూ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రజల్లో అవగాహన పెంచేలా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఎటువంటి అవరోధాలు లేకుండా ఆన్‌లైన్ సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డేటాలేక్ పనులు వేగవంతం చేయాలని, డ్రోన్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. దీనిపై ప్రభుత్వశాఖలతో వర్కుషాప్ పెట్టి అధికారులు కూడా దీనిపై అవగాహన పొందేలా చూడాలన్నారు. దోమల నివారణ, పురపాలక, ప్రజారోగ్యశాఖల్లో డ్రోన్‌లను ఎక్కువగా వినియోగించాలని తెలిపారు. వర్కుఫ్రం హోమ్ కార్యకలాపాలనూ వేగవంతం చేయాలన్నారు. దీన్ని నిరంతరం ప్రమోట్ చేస్తూ ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలని పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో ఎన్ని ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించగలం, వారికి ఎలాంటి నైపుణ్యాలు అవసరమనేదానిపై సమగ్ర కసరత్తు చేయాలని, దీనికోసం కన్సల్టెన్సీని నియమించుకోవాలని సూచించారు. మానవ వనరులకు నైపుణ్య శిక్షణ ఇప్పించాలని తెలిపారు. ఆర్‌టిజిఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ.. డేటా లేక్ పనులు దాదాపు పూర్తయ్యాయని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 273 రకాల సేవలు అందిస్తున్నామని చెప్పారు. అవేర్ హబ్ ద్వారా వాతావరణ పరిస్థితులు, పిడుగులపై గంటముందే ప్రజలను అప్రమత్తం చేసేలా చూస్తామని తెలిపారు. పౌరులు ఫోన్ ఎత్తగానే ఎఐ అథారిటీ ఐవిఆర్ఎస్ హెచ్చరిక వారికి వెళు తుందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, సిఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, పిఎస్ ప్రద్యుమ్న, సమాచారశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రవెన్యూశాఖ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌టిజిఎస్ సిఇఒ ప్రఖార్‌జైన్, డిప్యూటీ సిఇఒ ఎం మాధురి పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునిగా 'పాకా' ఏకగ్రీవం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యసభ సభ్యునిగా కూటమి అభ్యర్థి పాకా వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఆర్ వనితారాణి సోమవారం ప్రకటించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 22న నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, అందులో ఒక నామినేషన్ మాత్రమే చెల్లుబాటైందన్నారు. అభ్యర్థులెవరూ పోటీలో లేకపోవడంతో మిగిలిన అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించినట్లు వనితారాణి తెలిపారు.

ఆప్కాబ్ అవకతవకలపై హౌస్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కాబ్, డిసిసిబి, పిఎసిఎస్‌ల్లో (సహకార సంస్థల్లో) 2019-24లో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం హౌస్ కమిటీని నియమించింది. ఈ మేరకు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.. హౌస్ కమిటీ ఛైర్మన్‌గా అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ, మెంబర్లుగా కూన రవికుమార్, డి.నరేంద్రకుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ వెంకటరావు, బూర్ల రామాంజనేయులు, ఎన్ అమర్‌నాథ్‌రెడ్డిలును నియమించారు. ఈ కమిటీ 6నెలల్లోగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, జెసిలు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రబీలో ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించారు. కొనుగోళ్లలో ఇబ్బందులు, అకాల వర్షం వల్ల రైతులు పడుతున్న సమస్యలను జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గడిచిన తొమ్మిది నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.11,400 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేశామని తెలిపారు. అకాల వర్షాల వల్ల తడిసి ధాన్యమంతా కొనుగోలు చేస్తామని, తేమ 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను ఆదేశించారు. పంటల ఎన్యూమరేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇకపై బ్యాంకు గ్యారంటీనీ ప్రమాణికంగా 1:2గా అమలు చేస్తామని తెలిపారు. మూడు జిల్లాల్లో సిఎంఆర్ టార్గెట్‌ను అదనంగా పెంచామని చెప్పారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన ధాన్యం కొనుగోలు లక్ష్యం 30 వేల టన్నులకు అదనంగా మరో 50 వేల టన్నులు టార్గెట్‌లను పెంచుతున్నామని తెలిపారు. సమావేశంలో కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సివిల్ సప్లయిస్ అధికారులు, కుడా ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలపై అసత్య ప్రచారం

- మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాజీ సిఎం జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. వైసిపి హయాంలో యూనిట్ విద్యుత్ కేవలం రూ.2.49కే కొనుగోలు చేశామని జగన్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనిట్‌ను రూ.5 కంటే ఎక్కువ చెల్లించి విద్యుత్ సంస్థల నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. యాక్సిస్ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం వంద శాతం సక్రమమైనదేనని అన్నారు. ఈ సంస్థ రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు, ప్రభుత్వానికి పన్నుల రూపేణా లబ్ధి చేకూరుతుందని చెప్పారు.



అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ

- ఒరాకిల్‌తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఐటి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఒరాకిల్ సంస్థతో సోమవారం ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఒరాకిల్, ఎపిఎస్ఎస్‌డిసి ప్రతినిధులు ఎంఒయుపై సంతకాలు చేశారు. ఎంపిక చేసిన యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్ స్క్రిప్షన్ కంటెంట్ ఉచితంగా లభించనుంది. మహిళలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతలో ఒరాకిల్ క్లౌడ్ నైపుణ్యాల కోసం చేయూత అందించడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం.

తొలి ఏడాది లక్ష మంది, రెండు, మూడు సంవత్సరాల్లో లక్షన్నర మంది చొప్పున మొత్తం 4 లక్షల మందికి ఒరాకిల్ మై లెర్న్ డిజిటల్ ప్లాట్ ఫామ్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. ఒరాకిల్ క్లౌడ్ ఎసెన్సియల్స్, ఒసిఐ ఫౌండేషన్స్, ఎఐ ఫౌండేషన్స్, డేటాసైన్స్, క్లౌడ్ సెక్యూరిటీ క్యూరేటెడ్ లెర్నింగ్‌పాత్స్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అప్‌డేటెడ్ వెర్షన్స్‌లో గుర్తింపు పొందిన సర్టిఫికేషన్‌ల కోసం లెర్నింగ్ కంటెంట్‌ను ఎప్పటికప్పుడు నవీనీకరణ చేసి అభ్యర్థులకు అందిస్తారు. అదనపు మద్దతు, నెట్‌వర్కింగ్ కోసం ఒరాకిల్ యూనివర్సిటీ కమ్యూనిటీలో అభ్యర్థులకు యాక్సెస్ కూడా లభిస్తుంది. ఒరాకిల్ ఇన్ హౌస్ బృందం అభివృద్ధి చేసిన ఈ కోర్సులను నేర్చుకోవడానికి అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఒరాకిల్ అందించే ఎస్‌డిఐ సేవలను అభ్యర్థులు నమోదు చేసుకోవడానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందిస్తుంది. ఒరాకిల్ నిర్దేశించిన అర్హతా ప్రమాణాలకు లోబడి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి ఎమ్‌డి అండ్ సిఇఒ గణేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్‌కుమార్, ఒరాకిల్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శైలేంద్రకుమార్, సీనియర్ సేల్స్ డైరెక్టర్ దేబప్రియనందన్, వైస్ ప్రెసిడెంట్ (జపాక్ స్కిల్ డెవలప్‌మెంట్) తపస్‌రాయ్, టెరిటరీ సేల్స్ మేనేజరు షకీల్ అహ్మద్ మొహ్మద్, ప్రిన్సిపల్ క్లౌడ్ ఆర్కిటెక్ట్ వెంకట శివ నక్కా, కంట్రీ హెడ్ అశ్లేష ఖండే పార్కర్ పాల్గొన్నారు.

భారీ వర్షానికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంట నష్ట పోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మామిడి రైతులను ఆదుకోవాలని, కూలిపోయిన గుడిసెలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, పిడుగుపాటుకు, చెట్టుకూలిపోయి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. జరిగిన నష్టాన్ని సమగ్ర అంచనా వేసి సరైన పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సందర్భాల్లో రైతులకు ఉపయోగపడేలా పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించి అమలు చేయాలని సూచించారు. భారీ వర్షానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం, ఉద్యానవన పంటలు భారీగా దెబ్బతిన్నాయని తెలిపారు.

గోదావరి జిల్లాల్లో 50 వేల ఎకరాల ధాన్యం నీటమునిగిందని, గుంటూరు జిల్లాల్లో వేలాది ఎకరాలు ధాన్యంతోపాటు మొక్కజొన్న, అరటి పసుపు దెబ్బతిన్నట్లు ప్రభుత్వమే ప్రాథమిక అంచనా వేసిందని పేర్కొన్నారు. ఎన్‌టిఆర్, ఏలూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో చేతికొచ్చిన మామిడి పంట నేలకూలినట్లు ప్రభుత్వ అధికారులే చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రకృతి సృష్టించిన నష్టం అయినా ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉందని, చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాలు ఆందోళన చేసినా, ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయడంలో వైఫల్యం చెందిందని తెలిపారు. కాకినాడ జిల్లాల్లో ఆరు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ 4.40 లక్షల టన్నులే కొనుగోలు చేసిందని వివరించారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నష్టాన్ని అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు, ఆహార పంటలకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈదురుగాలులలో కూలిపోయిన గుడిసెలకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

రైతులను ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆహార పంటలకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కారణంగా పట్టాలు కప్పిన ధాన్యం సైతం తడిసి ముద్దయ్యాయని తెలిపారు. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న తడిసిపోగా, ఈదురుగాలులకు మామిడి, అరటి పంటలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరిమితి విధించడం వల్ల రైతులు ధాన్యం నిల్వలను కల్లాల్లోనే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే రెవెన్యూ సిబ్బందితో పంట నష్టాన్ని అంచనా వేయించి, పంటల బీమా వర్తింపు అంశాన్ని పరిశీలించాలని కోరారు. వీలైనంత త్వరగా రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధం కావాలన్నారు.



పరిమితి లేకుండా ధాన్యం కొనుగోలు

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై పరిమితిని తొలగించి రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండిస్తే, ప్రభుత్వం కొనుగోలు చేసింది కేవలం 13 లక్షల మెట్రిక్ టన్నులేనని, 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉందన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మరోవైపు ధాన్యాన్ని పిలిప్పిన్స్, మలేషియా దేశాలకు తెలంగాణ ప్రభుత్వం నేరుగా ఎగుమతి చేస్తోందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ, పంట నష్టం చోటు చేసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఉభయ గోదావరి జిల్లాల్లో ఎక్కడ చూసినా తడిసిన ధాన్యమే కనిపిస్తున్నాయని చెప్పారు. ఉద్యాన పంటలైన మామిడి, అరటి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఏ పంటకూ కనీస మద్దతు ధర లేదన్నారు. ధల స్థిరీకరణ కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.6 వేల కోట్లు వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఇది రాహుల్ గాంధీ విజయమన్నారు. బిజెపి నాయకులు తనను గాంధారి అంటే, తాను వాళ్లను కౌరవులు అంటానని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కె ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు ఎపి ఇసెట్ పరీక్ష

- రెండు సెషన్స్‌లో నిర్వహణ
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఎపి ఇసెట్ చైర్మన్, జెఎన్‌టియు విసి హెచ్ సుదర్శనరావు

ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎపి ఇసెట్- 2025 పరీక్ష మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరగనుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర వివరాలపై ఎపి ఇసెట్ చైర్మన్, అనంతపురం జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శన్‌రావు సోమవారం అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులకు వెల్లడించారు. ఎపి ఇసెట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 35,187 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా 11,029 దరఖాస్తులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కు వచ్చాయన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌కు 9,416, మెకానికల్ ఇంజనీరింగ్‌కు 4,757, సివిల్ ఇంజనీరింగ్‌కు 3,050 దరఖాస్తు అందాయని తెలిపారు. వీటితోపాటు ఫార్మసీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్‌ట్రుమెంటేషన్, మైనింగ్ ఇంజనీరింగ్ తదితర విభాగాలకు దరఖాస్తులు వచ్చాయన్నారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 110 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో రాష్ట్రంలో 109, హైదరాబాద్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి అభ్యర్థి మంగళవారం జరిగే పరీక్షకు ఉదయం సెషన్‌కు 7:30 గంటలకు, సాయంత్రం సెషన్‌కు 12:30 గంటలకు పరీక్ష హాల్లోకి రావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష హాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులూ తీసుకురాకూడదని స్పష్టం చేశారు. హాల్ టికెట్, ఎపి ఇసెట్ దరఖాస్తు ఫారం, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఐడి కార్డ్ మాత్రమే విద్యార్థులు వారి వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షలను ఒఎంఆర్ సీట్ పద్ధతిలో రాయాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎపి ఇసెట్ కో కన్వీనర్, అడ్వైజర్ టిఆర్.భానుమూర్తి, పిఆర్ఒ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

వియత్నాం వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వియత్నాంలో జరిగిన స్థాయిలో పోరాటాలు ప్రపంచంలో ఏ దేశంలోనూ జరగలేదని, ఆ దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. నాడు అమెరికాను యుద్ధంలో తరిమికొట్టి దేశంగా వియత్నాం చరిత్రలో నిలిచిందన్నారు. వియత్నాం పునరేకీకరణ దినోత్సవ 50వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా ఇటీవల జరిగాయని, ఈ వేడుకలకు సిపిఐ ప్రతినిధిగా తాను హాజరుకావడం గర్వంగా ఉందన్నారు. వియత్నాం పర్యటన ముగించుకుని రామకృష్ణ రాష్ట్రానికి చేరుకున్న సందర్భంగా విజయవాడలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సమితి ఆధ్వర్యాన ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వంగా అన్నింటా వియత్నాం విరాజిల్లుతోందని, విద్యా సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో ఎంతో విశిష్టత సాధించిందని తెలిపారు. లాస్ ఏంజిల్స్, డల్లాస్ నగరాలకు ధీటుగా వియత్నాం దేశ రాజధాని హనోయ్ సిటీ అభివృద్ధి చెందిందన్నారు. వియత్నాంలో 30 ఏళ్ల కిందట దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలు 70 శాతం మంది ఉండగా, ప్రస్తుతం అది 1.9 శాతం తగ్గిందని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, రాజారావు తదితరులు మాట్లాడారు.

డిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్‌కు అనుగుణంగా బదిలీలు
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జూన్ 6 నుంచి మెగా డిఎస్‌సి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉండవల్లిలోని ఆయన నివాసంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. డిఎస్‌సి పరీక్షలు నిర్వహించే కేంద్రాలతోపాటు టిసిఎస్ అయాన్ సెంటర్లలో కంప్యూటర్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని, డిఎస్‌సి కాల్ సెంటర్లలో ఎటువంటి కాల్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. టెట్ పరీక్షల్లో అర్హతలే డిఎస్‌సిలోనూ ఉంటాయన్నారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు సర్టిఫికెట్ల అప్‌లోడింగ్‌కు ఆప్షన్ సౌకర్యం కల్పించామన్నారు. వెరిఫికేషన్ నాటికి సర్టిఫికెట్లు సమర్పిస్తే సరిపోతుందన్నారు.

అలాగే ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాలపై మంత్రి సమీక్షించారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వన్ క్లాస్ వన్ టీచర్ ప్రాతిపదికన జిఒ 117కు ప్రత్యామ్నాయం రూపొందించామని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ఉత్తమ విద్యార్థులను షైనింగ్‌సార్స్ పేరిట సన్మానానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్‌కు లోబడి పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఆదేశించారు. విద్యాశాఖలోని అన్ని రకాల సిబ్బంది బదిలీలను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్స్ సిద్ధం చేయాలని సూచించారు.

అంబేద్కర్ విదేశీ విద్యపై విధివిధానాలు రూపకల్పన

అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని తిరిగి ప్రారంభించడానికి అవసరమైన విధివిధానాలను రూపొందించాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు, లెక్చరర్ల కొరత, పనితీరు మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డిగ్రీ కళాశాలల్లో త్రీమేజరు, సింగిల్ మేజర్ సబ్జెక్టుల్లో మెరుగైన విధానం అమలుకు స్టేక్ హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రతి క్వార్టర్‌కు విడుదల చేస్తామన్నారు.

తాగునీటికి 10.26 టిఎంసిలు కావాల్సిందే

- కెఆర్ఎంబిని కోరిన తెలంగాణ
- ముగ్గురు సభ్యుల కమిటీ భేటీ
- రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేసవి తాగునీటి అవసరాలతోపాటు వచ్చే జులై వరకు తెలంగాణ దాహార్తిని తీర్చేందుకు దాదాపు 10.26 టిఎంసిలు అవసరమని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. కెఆర్ఎంబి (కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులు గైర్హాజరయ్యారు. కెఆర్ఎంబి బోర్డు సమావేశాలను విజయవాడలో నిర్వహించాలని కోరుతూ లేఖ రాశారు.

ఈ సందర్భంగా కెఆర్ఎంబి ఎదుట తెలంగాణ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్ నిరసన వ్యక్తం చేశారు. ఎండాకాలం తాగునీటి సమస్యపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణంలో ఎపి నీటిపారుదల శాఖ అధికారులు రాకపోవడం సమంజసం కాదన్నారు. జులై 31 వరకు కల్వకుర్తికి 300 క్యూసెక్కులు, హైదరాబాద్‌కు 750 క్యూసెక్కులు, ఖమ్మంకు 300 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం ఇవ్వాలని తెలంగాణ ఇఎన్‌సి కోరారు. మొత్తంగా జులై నెలాఖరు వరకు తాగునీటి అవసరాల కోసం 10.26 టిఎంసిలు కావాలని తెలిపారు.

4.28 క్యూసెక్కులు ఆవిరి నష్టాలు పోతే ఉన్న 15 టిఎంసిల్లో 0.55 టిఎంసిలు మిగులుతాయని కెఆర్ఎబి చైర్మన్‌కు ఇఎన్‌సి వివరించారు. నాగార్జునసాగర్‌లో 510 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపింగ్ చేయడం సరికాదనీ, ఎపి వినియోగం తగ్గించుకోవాలని గతంలో చెప్పామని చైర్మన్ దృష్టికి తెచ్చారు. కాగా, తెలంగాణ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని బోర్డు కోరింది. కెఆర్ఎంబి ఆదేశాలు వచ్చే వరకు నాగార్జునసాగర్ కుడికాల్వ రెగ్యులేటర్, ముచ్చుమర్రి నుంచి నీరు వాడరాదని తెలంగాణ కోరింది.

మద్యం కేసులో ముందస్తు బెయిల్‌పై హైకోర్టుదే నిర్ణయాధికారం

- సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో మద్యం కేసుకు సంబంధించిన ముందస్తు బెయిల్‌పై హైకోర్టుదే నిర్ణయాధికారమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మద్యం అవినీతి వ్యవహారంలో ముందస్తు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కృష్ణమోహన్ రెడ్డి, ధనంజయ్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప ఆశ్రయించారు. ఈ ముగ్గురు దాఖలు చేసిన పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. బుధవారం హైకోర్టులో విచారణ ఉన్నందున తాము వెంటనే జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అరెస్టు చేయకుండా స్టే ఇవ్వాలని ముగ్గురు పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు వికాష్ సింగ్, సిద్ధార్థ దవే, నాగముత్తు కోరారు.

అయితే ధర్మాసనం స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అరెస్టు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టేట్‌మెంట్ ఇవ్వాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, సిద్దార్థ లూథ్రా జోక్యం చేసుకుని అలాంటి స్టేట్‌మెంట్లు ఇవ్వడం కుదరదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ ఉందని జస్టిస్ పార్థివాలా అన్నారు. బుధవారం విచారణలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు ధర్మాసనం సూచించింది. కేసుకు సంబంధించిన మెరిట్స్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని జస్టిస్ పార్థివాలా అన్నారు. హైకోర్టులో విచారణ ముగిసి, ఆదేశాలిచ్చిన తరువాతే తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే సుప్రీంకోర్టులో దాఖలు చేయాలని పిటిషనర్లకు ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 8కు వాయిదా వేసింది.

లారీలో చెలరేగిన మంటలు

- డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి- డెంకాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని జాతీయ రహదారిపై నాతవలస టోల్ ప్లాజా సమీపంలో సోమవారం లారీలో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ సజీవ దహనమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన డ్రైవర్ బసుదేవ్ సిక్‌దర్ (45) సొంత రాష్ట్రం నుంచి విశాఖపట్నం వైపు లారీతో నారసంచులను తీసుకెళ్తున్నారు. నాతవలస టోల్‌గేట్ సమీపంలోకి రాగానే ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో లారీ కేబిన్‌లో డ్రైవర్ చిక్కుకున్నారు. బయటకు రావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఈ మంటలు లారీలో ఉన్న జ్యూట్ సంచులకు వ్యాపించాయి. కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ సిక్‌దర్ ఆ మంటల్లోనే సజీవ దహనమయ్యారు. లారీ కూడా పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మరో ప్రమాదం జరగకుండా ముందు ఆగి ఉన్న లారీని బయటకు తీయించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' రక్షణతో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవడమంటే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడుకోవడమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నమ్మి సింహాద్రి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1544వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిఎస్ఇయు, టిఎన్‌టియుసి యూనియన్ల కార్యకర్తలు, ఉక్కు ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టుగా వింటూ కార్మికులకు నష్టం చేకూర్చే చర్యలు చేపడుతోందన్నారు. త్యాగాలతో సాధించుకున్న కర్మాగారాన్ని కాపాడుకోవడానికి కార్మికులు మరింత ఉధృత పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ప్రజలంతా వారికి మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు.

లేటరైట్ తవ్వకాల లీజులను రద్దుచేయాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం



లేటరైట్ తవ్వకాలను పరిశీలిస్తున్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పీసా, 1/70 చట్టం నిబంధనలు ఉల్లంఘించి, పర్యావరణానికి నష్టం కలిగించే లేటరైట్ తవ్వకాల లీజులను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన చట్టాలను ఉల్లంఘించి తవ్వకాలు చేపడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాతవరం మండలం సుందరకోట పంచాయతీ నాగులకొండలో తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ లేటరైట్ తవ్వకాలను ఆపించాలని కోరారు. గత ప్రభుత్వంలో వ్యతిరేకించిన టిడిపి కూటమి నాయకులు ఇప్పుడు అధికారంలో ఉండి తవ్వకాలు చేయించడం దుర్మార్గమన్నారు.

గ్రామ సభ ఆమోదం లేకుండా తవ్వుతున్న 121 హెక్టార్ల అనుమతులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జీడి, మామిడి, వరి, ఇతర ఆహార పంటలు దెబ్బతినడంతో గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృక్ష, ఔషధ సంపదను నాశనం చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు అన్యాయం చేసే లేటరైట్ తవ్వకాలను రద్దుచేయకపోతే పోరాటాలతో అడ్డుకుంటామన్నారు. కనీస సౌకర్యాల్లేని గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా, ఆదివాసీ వనరులను కొల్లగొట్టేలా ప్రభుత్వం చట్టాలను సవరిస్తోందని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు కాపాడుకుంటూ వస్తున్న అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం అప్పగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు, సీనియర్ నాయకులు త్రిమూర్తులు రెడ్డి, రాజవొమ్మంగి మండల కార్యదర్శి సూరిబాబు, ప్రజానాట్య మండలి నాయకులు రమేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద పేదలతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చే వరకూ పోరాటం

- శ్రీసత్యసాయి కలెక్టరేట్ వద్ద ధర్నాలో వి.రాంభూపాల్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, టిడ్కో నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పేదలు సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్‌టిసి డిపో నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. మండుటెండలో కలెక్టరేట్ వద్దే బైఠాయించి ధర్నా చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. కార్పొరేట్లకు వేలాది ఎకరాల భూములను కట్టబెడుతున్న ప్రభుత్వానికి పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలంటే చేతులు రావడం లేదని విమర్శించారు. గత మార్చి 25వ తేదీన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పేదలతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టామన్నారు. ఆర్‌డిఒలు, తహశీల్దార్లకు అర్జీలు ద్వారా విన్నవించామని తెలిపారు. అయినా పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో జాప్యం కొనసాగుతూనే ఉందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఆ హామీ ఊసే లేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టరేట్ వద్దనే వంటా వార్పు నిర్వహించి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్.వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, శ్రామిక మహిళా సంఘం కార్యదర్శి దిల్షాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎపిపిజిసెట్-2025 ఆన్లైన్ దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

ఎపిపిజిసెట్ - 2025 ఆన్లైన్ దరఖాస్తుల గడువును 11వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ విసి, పిజి సెట్-2025 చైర్మన్ ఆచార్య అప్పారావు, కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు తెలిపారు. ముందుగా ఏప్రిల్ రెండు నుంచి మే ఐదు వరకు ఎపిపిజిసెట్ - 2025 ఆన్లైన్ అప్లికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్ విడుదలైంది. దానిని పొడిగిస్తూ సోమవారం మరో నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ తొలిసారిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఎపిపిజిసెట్-2025 నిర్వహించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అప్పగించిందని, ఈ సారి ఎం.ఎ, ఎం కామ్., ఎంఎస్‌సి, వంటి పిజి కోర్సుల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఆన్లైన్ అప్లికేషన్ గడువు తేదీని ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మే 11వ తేదీ వరకు పొడిగించామని తెలిపారు. మే 12 నుంచి 15 తేదీ వరకు రూ.వెయ్యి, 20వ తేదీ వరకు రూ.రెండు వేలు, 24వ తేదీ వరకు రూ.నాలుగు వేలు, 25వ తేదీ వరకు రూ.పది వేలు చొప్పున అపరాధ రుసుముతో ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని వారు వివరించారు. ఈ ఎంట్రన్స్ పరీక్ష 153 కోర్సుల్లో చేరడానికి 31 పరీక్షలను జూన్ తొమ్మిది నుంచి 13వ తేదీ వరకూ మూడు సెషన్స్‌లో నిర్వహిస్తారని, 13 పాత జిల్లా కేంద్రాలను ఆధారంగా దాదాపు 35 పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 22 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులు ఈ సదవకాశం వినియోగించు కోవాలని కన్వీనర్ కోరారు.

నేరాల దర్యాప్తులో అధునాతన టెక్నాలజీ

- లా అండ్ ఆర్డర్ ఎడిజి మధుసూదన్‌రెడ్డి, ఐజి పాలరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేరాల దర్యాప్తులో అధునాతన టెక్నాలజీని ఉపయోగించి నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేందుకు ఎఫ్ఎస్ఎల్ కృషి చేస్తోందని లా అండ్ ఆర్డర్ ఎడిజి మధుసూదన్‌రెడ్డి, ఎఫ్ఎస్ఎల్ ఐజి పాలరాజు తెలిపారు. ఎఫ్ఎస్ఎల్ అనుసరించే ముందస్తు ప్రణాళికలు గురించి రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ దర్యాప్తు అధికారులు, పిపిలు, డాక్టర్స్‌కు ఫోరెన్సిక్ ఆధారాల ప్రాముఖ్యతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని డిజిపి కార్యాలయం నుంచి సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. డిఎన్ఎ, బయోలజీ, టాక్సికాలజీ, నార్కొటిక్స్, సైబర్ ఫోరెన్సిక్స్, డాక్యుమెంట్స్, బాలిస్టిక్స్, ఇతర విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఎపిఎఫ్ఎస్ఎల్ (రాష్ట్ర న్యాయ విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల) నిపుణులు ప్రతి జిల్లాలో శిక్షణ సమావేశాలు నిర్వహించనున్నారని తెలిపారు. వర్క్‌షాప్‌లో ముఖ్యంగా నేరపరిశోధన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎఫ్ఎస్ఎల్ ద్వారా జీరో పెండెన్సీ పెండింగ్ కేసులు లేకుండా చూడటం, స్థానికంగా ఉండే రీజనల్ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్స్, పోలీస్ స్టేషన్లను సెంట్రల్ ల్యాబ్‌తో అనుసంధానించడం, రియల్ టైమ్ డేటాను షేర్ చేసుకోవడం ద్వారా దర్యాప్తులో పురోగతి ఉంటుందన్నారు. ఎఐ టూల్స్ పరిజ్ఞానం సాంకేతికతను ఉపయోగించి విచారణను మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా త్వరితగతిన పూర్తి చేయడానికి సాధ్యపడుతుందన్నారు.

గ్రీవెన్స్‌లో వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

- శ్రీకాకుళం కలెక్టర్ ఎదుటే పెట్రోల్ పోసుకున్న బాధితురాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



విలపిస్తున్న వృద్ధురాలు మంగమ్మ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో సోమవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వినతి పత్రాలు తీసుకుంటున్న సమయంలో ఓ వృద్ధురాలు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. బాధితురాలి వివరాల మేరకు.. శ్రీకాకుళం నగరం బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన లొట్టి మంగమ్మ పాత్రునివలస, బలగ రూరల్ రెవెన్యూ పరిధిలో ఉన్న వారసత్వంగా సంక్రమించిన భూముల్లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తన వాటాకు వచ్చిన భూములను తనకు అప్పగించేలా చూడాలంటూ ఫిర్యాదుతో ఆమె గ్రీవెన్స్ నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ సమావేశ మందిరానికి వచ్చారు. కలెక్టర్, ఇతర అధికారులు వినతులు స్వీకరిస్తున్న ప్రాంతానికి అతి సమీపంలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను తీసి ఒంటిపై పోసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో పోలీసులు ఆమెను వేరే గదిలోకి తీసుకెళ్లారు. కలెక్టర్‌తోపాటు అప్పటికే అక్కడున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆమెతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు లొట్టి మంగమ్మ, ఆమె కుటుంబ సభ్యుల మధ్య చాలా కాలంగా వివాదం నడుస్తున్నట్లు తెలుసుకున్నారు. ఇదే అంశంపై శ్రీకాకుళం ప్రిన్సిపల్ జిల్లా కోర్టు బాధితురాలి పేరిట డిక్రీ జారీ చేసినట్లు గుర్తించారు. దీనిపై మంగమ్మ కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో, రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని ఆమెకు స్వాధీనం చేయలేదు. పూర్తి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ శ్రీకాకుళం తహశీల్దార్‌ను పిలిపించారు. ఆస్తుల వివరాలు, కోర్టు ఉత్తర్వులను చదివి మంగమ్మకే స్థలాన్ని స్వాధీనం చేయాలని ఆదేశించారు. పోలీసుల సాయంతో ఆమెను ఇంటికి పంపారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యుత్ దోపిడి

- సంతకాల సేకరణలో సిహెచ్ బాబూరావు
- 7న విజయవాడ విద్యుత్ సౌధ వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయవాడ



సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు.

గత వైసిపి ప్రభుత్వం దారిలోనే నేడు టిడిపి కూటమి ప్రభుత్వం పయనిస్తూ విద్యుత్ దోపిడీని కొనసాగిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 7వ తేదీన గుణదల విద్యుత్ సౌధ వద్ద నిర్వహించే "ప్రజాభేరి" నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ఆదాని, యాక్సిస్ తదితర బడా కంపెనీలతో అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. వందలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కార్పొరేట్ల దోపిడీ, పాలకుల అవినీతి ఫలితంగానే ప్రజలపై విద్యుత్తు భారాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ దోపిడీని తీవ్రతరం చేశాయని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్తు భారాలు పెంచబోమని హామీ ఇచ్చి మాట తప్పి, నమ్మకద్రోహం చేసిందని పేర్కొన్నారు. నాలుగు రకాల సర్దుబాటు ఛార్జీలు.. ప్రతి ఒక్కరి నుండి వసూలు చేస్తూ రూ. 15,485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. అదానీ సంస్థతో సెకి ద్వారా రూ.1750 కోట్ల లంచాలు తీసుకుని గత రాష్ట్ర ప్రభుత్వం 25 సంవత్సరాల పాటు సోలార్ విద్యుత్ సరఫరా చేసే ఒప్పందాన్ని ఆమోదించిందని అన్నారు. రూ. లక్షా 20 వేల కోట్ల భారం మోపే ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తామని గత ఎన్నికల ముందు టిడిపి కూటమి నేతలు చెప్పిన విషయము గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నేడు ఆ ఒప్పందాన్ని కొనసాగించడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్, నేతలు కె దుర్గారావు, వై సుబ్బారావు, ఝాన్సీ, లక్ష్మణ, కొండ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల హక్కులు కాపాడుకుంటేనే దేశ సమైక్యత

- కె శేషగిరి వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

రాష్ట్రాల హక్కులు కాపాడుకోవడం ద్వారానే దేశ సమైక్యత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని వివరించారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, కోరెడ్ల శేషగిరి 4వ వర్ధంతి సభ విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ స్ఫూర్తిని కలిగిన వ్యక్తి శేషగిరి అని అన్నారు. ఆయన ఎన్నో ఉద్యమాలు చేసి ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. శేషగిరి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 'భారత ఫెడరలిజం – సవాళ్లు' అనే అంశంపై స్మారక ఉపన్యాసం లక్ష్మణరావు చేశారు. ఏ దేశానికైనా ఆ దేశ రాజ్యాంగం వెన్నుముక వంటిదని అన్నారు. ఇందులో భాగంగానే భారత సమాఖ్య విధానాన్ని రాజ్యాంగం ద్వారా రూపొందించుకున్నామని గుర్తుచేశారు. ఈ విధానం ప్రకారం కేంద్ర ప్రభుత్వం పరిధిలో 97 అంశాలు, రాష్ట్ర జాబితాలో 66 అంశాలు, ఉమ్మడి జాబితాలో 44 అంశాలు ఉన్నాయని వివరించారు. వాటిలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ హక్కులను హరిస్తోందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన జిఎస్‌టి విధానం వల్ల రాష్ట్రాలకు రూ.లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోందని వివరించారు. 2020 నూతన విద్యావిధానంతో పేదలు విద్యను కొనుక్కోవాల్సిన దుస్థితి, కార్పొరేట్ విద్యాసంస్థలు రూ.కోట్లు గడించే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కొత్తగా మన దేశంలో బహుపార్టీ విధానాన్ని పక్కకు నెట్టేందుకు కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే గవర్నర్ల, రాష్ట్రపతులను ఉపయోగించుకుని అసెంబ్లీలు, పార్లమెంట్‌లలో ఆయా సభలు చేసిన చట్టాలను తిరస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని గుర్తుచేశారు. వీటిపై మన రాష్ట్రంలోని సిఎం, డిప్యూటీ సిఎం నోరు మెదపడం లేదన్నారు. దీనిపై తమిళనాడు సిఎం స్టాలిన్ సుప్రీం కోర్టును ఇటీవల ఆశ్రయించడంతో చారిత్రాత్మక తీర్పు వచ్చిందని వివరించారు.

గవర్నర్, రాష్ట్రపతులకు చట్టసభల్లో చేసిన చట్టాలను అడ్డుకునే అధికారం లేదని న్యాయస్థానం తేల్చిచెప్పడంతో కేంద్రంలోని బిజెపి కంగుతిందని అన్నారు. ఫెడరలిజానికి వ్యతిరేకంగా తిరిగి జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దేశ సమైక్య విధానాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శేషగిరి రాసిన వ్యాసాల సంపుటి 'తరుగులేని కీర్తి సిరి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు,రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్‌రావు, నాయకులు కె.విజయగౌరి, డి.రాము, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సాహితీస్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో విషాదం

- చెట్టుకూలి మహిళ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



పూర్ణిమ (ఫైల్)

విశాఖలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. సీతమ్మధారలోని ఎవిఎంజి హాస్పిటల్ వద్ద భారీ వృక్షం కూలి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళపై పడడంతో ఆమె మృతి చెందారు. ఈ సంఘటన ఎంవిపి.పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన పూర్ణిమ (40) ఎవిఎంజి హాస్పిటల్‌కు ఎదురుగా ఉన్న సరిత ఎంక్లేవ్ నాలుగో అంతస్తులో నివాసముంటున్నారు. ఇంట్లోకి సరుకులు తెచ్చుకునేందుకు బయటకు వచ్చారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆమెపై చెట్టు పడిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త తూర్పుగోదావరి జిల్లాలో బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెట్టు కూలడంతో అక్కడే ఉన్న కారు, ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ధ్వంసమయ్యాయి. ప్రమాద స్థలాన్ని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, స్థానిక కార్పొరేటర్ పద్మా రెడ్డి పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే చెట్టు కూలి పూర్ణిమ చనిపోయారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో భారీ వృక్షాలు ఎండిపోయి, కొమ్మలు ఊడి పడుతూ ఉంటాయన్న విషయం తెలిసినప్పటికీ జివిఎంసి హార్టికల్చర్ విభాగం అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదని తెలిపారు. అయితే, మహిళ మృతిచెందిన ఘటన తరువాత జివిఎంసి స్పందించింది. ఆ ప్రాంతంలో చెట్ల కొమ్మలను తొలగించే పనులను క్షేత్రస్థాయిలో చేపట్టింది.

నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పండి

- వైసిపి నాయకులకు జగన్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించాలని, వారికి ధైర్యం చెప్పాలని వైసిపి నాయకులను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అందుబాటులో ఉన్న రీజనల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నాయకులతో ఆయన ఫోన్లో మాట్లాడారు. కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలన్నారు. అకాల వర్షాలకు పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతోపాటు అనేక ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వర్షాలు వస్తాయని ముందుగా సమాచారం ఉన్న కల్లాల్లోని పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆగ్రహించారు. ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రబీ సీజన్లోనైనా తేరుకుందామనుకున్న వారికి తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలుచోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు అకాల వర్షాల వల్ల మరింతగా నష్టపోతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఉద్యాన పంటలూ దెబ్బతిన్నాయని, ఆయా ప్రాంతాల్లో నాయకులు పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని, వారిని ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

జీఈ వెర్నోవాతో అజాద్ ఇంజనీరింగ్ మరో ఒప్పందం



హైదరాబాద్ : జీఈ వెర్నోవాకు చెందిన స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ యూనిట్‌తో అదనపు దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రెసిషన్ ఇంజనీరింగ్‌లో గ్లోబల్ లీడర్ అయిన ఆజాద్ ఇంజనీరింగ్ ప్రకటించింది. 53.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.450 కోట్లు) విలువైన ఈ ఒప్పందం 2030 వరకు ఆరేళ్ల పాటు కొనసాగనుందని తెలిపింది. హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో ఆజాద్ ఇంజనీరింగ్ వారి ప్రత్యేకమైన 7,600 చదరపు మీటర్ల లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఇటీవల ప్రారంభించిన తర్వాత ఈ అదనపు ఒప్పందం కుదరడం ఒక కీలక మైలురాయి అని ఆ సంస్థ చైర్మన్, సిఇఒ రాకేష్ చోప్దార్ తెలిపారు. తాజా ఒప్పందం జీఈ వెర్నోవా అధునాతన టర్బైన్ వ్యవస్థలు, అవసరమైన పరిశ్రమల కోసం అత్యధిక పనితీరు కనబరిచే వ్యవస్థల విశ్వసనీయ సరఫరాదారుగా ఆజాద్ ఇంజనీరింగ్ నిలుస్తుందన్నారు.

వడ్డీ రేట్లు 1.25 శాతం తగ్గించొచ్చు

- రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం
- ఎస్‌బిఐ రీసెర్చ్ అంచనా



న్యూఢిల్లీ : దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినందున రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించడానికి వీలుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3 శాతం దిగువకు తగ్గొచ్చని తెలిపింది. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డీ రేట్లను 125 బేసిస్ పాయింట్లు (1.25 శాతం) తగ్గించొచ్చని అంచనా వేసింది. హెచ్చు వడ్డీ రేట్ల భారం వేళ ఎస్‌బిఐ రీసెర్చ్ ప్రకటన రుణ గ్రహీతల్లో ఆశావాదాన్ని నింపుతోంది.

"జూన్-ఆగస్టు సమయంలో 75 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్ల తగ్గింపును అంచనా వేస్తున్నాము. ద్వితీయార్థంలో మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గించొచ్చు. 2025 మార్చిలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 3.34 శాతానికి తగ్గి 67 నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఆహారోత్పత్తుల ధరల్లోనూ తగ్గుదల చోటు చేసుకుంది. 2025-26లో స్థూలంగా 4 శాతం లోపే ద్రవ్యోల్బణం ఉండొచ్చు. అల్ప స్థాయిలో ద్రవ్యోల్బణం, తక్కువ వడ్డీ రేట్లు జిడిపి వృద్ధికి మద్దతును అందించనుంది." అని ఎస్‌బిఐ తన రీసెర్చ్ రిపోర్టులో పేర్కొంది.

ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ ఇటీవల ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన వరుస సమావేశాల్లో కీలక వడ్డీ రేట్లకు 25 బేసిస్ పాయింట్ల చొప్పున అర శాతం కోత పెట్టింది. దీంతో రెపోరేటు 6 శాతానికి దిగివచ్చింది. ఇది రుణ గ్రహీతలపై కొంత భారం తగ్గించింది. అయితే భారీగా వడ్డీ రేట్లు తగ్గడం వల్ల డిపాజిట్లపై కూడా ప్రతికూల ప్రభావం పడొచ్చని ఎస్‌బిఐ రీసెర్చ్ పేర్కొంది. డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గడం ద్వారా ఎఫ్‌డిల వృద్ధి స్తబ్ధతలోకి జారుకునే అవకాశాలు లేకపోలేదని తెలిపింది.

పతనావస్థలో డాలర్

- వారెన్ బఫెట్ వెల్లడి



వాషింగ్టన్ : అమెరికా డాలర్ పతనావస్థలో ఉందని ప్రముఖ బిలియనీర్, బెర్క్‌షైర్ హాత్వే సిఇఒ వారెన్ బఫెట్ అన్నారు. శనివారం జరిగిన బెర్క్‌షైర్ హాత్వే 60 వార్షిక వాటాదారుల సమావేశంలో బఫెట్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డాలర్ డీలా పడుతోందన్నారు. "ఒక దేశంగా మనకు ఎప్పుడూ చాలా సమస్యలు ఉంటాయి. కానీ ఇది మాత్రం మనమే తెచ్చుకున్న సమస్య. అమెరికా ఆర్థిక విధానాలు, వాణిజ్య విధానం వంటివన్నీ డాలర్ మీద ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి." అని బఫెట్ పేర్కొన్నారు. పెట్టుబడిదారులు కేవలం యుఎస్ డాలర్ మీద మాత్రమే కాకుండా, ఇతర కరెన్సీలలో కూడా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. అమెరికాలో ఆర్థిక లోటు సమస్య ఎప్పటి నుంచో పరిష్కారం కాకుండా ఉందన్నారు. ఈ పరిస్థితి ఇంకా ఎన్ని సంవత్సరాలు కొనసాగుతుందో అంచనా వేయలేకపోతున్నామని చెప్పారు. అమెరికా చాలా కాలంగా భరించలేని ఆర్థిక లోటుతో పని చేస్తోందన్నారు. ఇది ప్రస్తుతం నియంత్రించలేని స్థాయికి చేరిందన్నారు.

సిఇఒ పదవీకి రాజీనామా..

వారెన్ బఫెట్ త్వరలోనే తన సిఇఒ పదవీని వీడనున్నారు. తన పదవీ విరమణ ప్రణాళికలను ప్రకటిస్తూ.. 2025 చివరి నాటికి ఆ పదవి నుంచి వైదొలుగుతానని వాటాదారుల సమావేశంలో వెల్లడించారు. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని చెప్పారు. గ్రెగ్ అబెల్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తారని వెల్లడించారు. తన పదవీ విరమణ, గ్రెగ్‌ను సిఇఒగా నియమించాలనే నిర్ణయాలు తన కుటుంసభ్యులకు తప్పా గ్రెగ్‌కు కూడా తెలియదన్నారు.

సంపాదకీయం


అస్పష్ట అమరావతి

విభజనకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదకొండేళ్ల తర్వాత కూడా రాజధాని రూపు రేఖలపై అస్పష్టత వీడకపోవడం ఏలికలు సృష్టించిన ఉత్పాతం. టిడిపి కూటమి ప్రభుత్వం శుక్రవారం పెద్ద హైప్ ఇచ్చి ప్రధాని మోడీతో రాజధాని అమరావతి పున:ప్రారంభ మహోత్సవం నిర్వహించాక కూడా అయోమయం అలాగే ఉంది. రూ.49 వేల కోట్ల విలువైన అమరావతి పునర్నిర్మాణ 74 ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపనలు చేశారు. రాజధాని నిర్మాణం స్వాగతించదగినది. ప్రధాని అమరావతికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారంటే ఎంత ఆర్థిక సాయం చేస్తారన్న ఉత్సుకత ప్రజల్లో ఉంటుంది. కానీ ప్రధాని మాటలతో సరి పెట్టి అందరినీ తీవ్ర నిరాశకు గురి చేశారు. 2015 అక్టోబర్ 22 దసరా రోజున అమరావతికి తొలుత శంకుస్థాపన చేసిన మోడీ గుప్పెడు మట్టి చెంబుడు నీళ్లు తెచ్చి అదే కొండంత సాయమనుకోమన్నారు. దశాబ్దం గ్యాప్ తీసుకొని ఒట్టి మాటలు వల్లించడం మోడీకే చెల్లింది. అప్పుడు ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ సాయానికి ఉబ్బితబ్బివ్వడం రాష్ట్ర ప్రజలకు ఎదురైన ఒకానొక విచిత్ర అనుభవం!

పదేళ్లుగా అమరావతికి నిరంతరయంగా తాము సాయం చేస్తూనే ఉన్నామని పున:ప్రారంభ వేదికపై ప్రధాని అవాస్తవం చెప్పారు. అంతగా నిధులిస్తే ఎందుకు రాజధాని పూర్తి కాలేదన్న ప్రశ్నకు సమాధానం ఉండదు. నాడు చంద్రబాబు ప్రతిపాదిత బాహుబలి అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లవుతుందని అంచనాలు కట్టగా కేంద్రం తొలినాళ్లలో విదిల్చిన 1,500 కోట్లే మినహా రూపాయి రాలేదు. స్విట్జర్లాండ్, ప్రపంచబ్యాంక్ పేరిట హడావుడే తప్ప తొలి ఐదేళ్లల్లో టిడిపి సర్కారు తాత్కాలిక భవనాలకే పరిమితమైంది. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల ఆట తెరమీదకి తేగా ప్రధానిగా ఉన్న మోడీ వారించలేదు సరికదా, రాజధానిరాష్ట్ర ప్రభుత్వం ఇష్టమని ఉన్నత న్యాయస్థానాల్లో కేంద్రం అఫిడవిట్‌లు ఇచ్చింది. అమరావతి పున:ప్రారంభ సభలోనూ జగన్‌ను మోడీ ఏమీ అనలేదు. వైసిపి సైతం ప్రధాని రాష్ట్రానికి ఏమీ చెయ్యకపోయినా, అమరావతికి నయాపైసా ప్రకటించకపోయినా నోరు మెదపలేదు. దీన్నిబట్టే కేంద్ర బిజెపికి, జగన్‌కు మధ్య సంబంధ బాంధవ్యాలేమిటో తెలిసిపోతుంది.


అమరావతి '2.0' సాకారం కావాలంటే 77 వేల కోట్లు కావాలని టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్టిమేట్ వేసింది. వాటిలో కేంద్రం మధ్యవర్తిగా ప్రపంచ బ్యాంక్ నుంచి ఇప్పించే అప్పు 15 వేల కోట్లు కాగా హడ్కో రుణం 11 వేల కోట్లు, జర్మనీ బ్యాంక్ కెఎఫ్‌డబ్ల్యు లోన్ ఐదు వేల కోట్లకు ఒప్పందాలు కుదిరాయంటున్నారు. అంతా కలిపితే 31 వేల కోట్లు. మిగిలిన 46 వేల కోట్లూ కేంద్రం ఇవ్వాలని రాష్ట్రం అభ్యర్థిస్తోంది. దీనిపై ప్రధాని దాట వేశారు. అమరావతి ఒక నగరం కాదు అదొక మహాశక్తి ఎపిని ఆధునికాంధ్రగా మారుస్తుంది దేశానికి మార్గదర్శనం చేస్తుంది గ్రోత్ ఇంజన్ అవుతుంది మీ భుజాలకు నా భుజం కలుపుతా కలిసిమెలిసి పని చేద్దాం.. అంటూ మాటల మాంత్రికునిలా మోడీ వ్యవహరించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి నేతలు పారవశ్యంలో తరించారు. విభజన చట్టంలో రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదని స్పష్టంగా పేర్కొనగా, చట్టాన్ని అమలు చేయాలని, నిధులివ్వాలని అడిగే ధైర్యం చంద్రబాబుకు, కూటమి నేతలకు లేకపోయింది. అప్పులు సమీకరించుకోడానికి సహకరిస్తామని మాత్రమే కేంద్రం చెపుతోంది. అప్పులతో కేపిటల్‌ను కడితే ప్రజలపై భారాలు తథ్యం. రాష్ట్రాన్ని ఇంతగా దగా చేస్తున్నా బిజెపిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అపార ప్రేమ వాత్సల్యాలు కురిపించడం నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచడమే. రాజధానికి 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులు అమరావతే రాజధానిగా చట్టబద్ధత కోరుతున్నారు. సిఎం ఆ మేరకు హామీ ఇచ్చారు కూడా. కానీ పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన మోడీఆ ఊసెత్తక పోవడం రైతులను వంచించడం కాదా? తీసుకున్న భూములకే దిక్కులేకపోగా ఇంకా 44 వేల ఎకరాలు దేనికో అర్థం కాదు. బాహుబలి రాజధానికి స్వస్తి పలికి అన్ని వసతులతో రాజధానికి పరిమితం కావాలన్నది నిపుణుల సూచన. విభజన చట్టం మేరకు ప్రత్యేక హోదా సహా హామీల సాధన ద్వారా ప్రణాళికాబద్ధ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారు. వారి ఆకాంక్షల ప్రకారం నడుచుకోడం రాష్ట్ర ప్రభుత్వ విధి.

మంచి మాట



ప్రాచీనమైనంత మాత్రాన
ప్రతిదీ మంచిది గాదు.
ఆధునికమైందని
త్యజించాల్సిన అవసరమూ లేదు.
సజ్జనులు పరీక్షించి మంచిదాన్ని
ఎంచుకొంటారు.
మూర్ఖులు ఇతరులు చెప్పిందాన్ని
గుడ్డిగా నమ్ముతారు.
- మహాకవి కాళిదాసు

సుంకాల సంప్రదింపులు - రైతాంగం



ట్రంప్ ఇండియాపై విధించిన అధిక సుంకాలకు జవాబుగా ఇండియా కూడా అమెరికా మీద అధిక సుంకాలను విధించి వుంటే దేశంలోని రైతులకు పెద్ద సమస్య ఉండేది కాదు. కాని ఇండియా ట్రంప్ ప్రభుత్వంతో సంప్రదింపులకు అంగీకరించింది. అంటే అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద ఇప్పుడున్న సుంకాలను తగ్గించడానికి సూత్రప్రాయంగా ఒప్పుకున్నట్టే. అప్పుడు రైతుల వ్యవసాయోత్పత్తులకు ఇప్పుడు ఉన్న రక్షణ ఇక ముందు కాలంలో ఉండదు. భారీ ప్రభుత్వ నగదు బదిలీ అండతో అమెరికన్ రైతులు తమ ఉత్పత్తులను మన దేశానికి తెచ్చి ఇక్కడ చాలా తక్కువ రేట్లకు అమ్మగలుగుతారు. ఆ స్థాయికి మన రైతులూ తమ ఉత్పత్తుల ధరలను తగ్గించుకోక తప్పనిసరి పరిస్థితి వస్తుంది.

ప్రజాదృక్పథం



ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక శాస్త్రంలో ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు 'లోపరహితమైన' పోటీ అనే పూర్తి ఊహాజనితమైన భావనతో ప్రారంభిస్తాయి. సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తలు దీనికి భిన్నంగా ఉండే 'స్వేచ్ఛా పోటీ' అనే భావనను ఉపయోగిస్తారు. మార్క్స్ కూడా దీనినే వాడాడు. సమానమైన నైపుణ్యం కల పనికి సమాన వేతనం, ఏ రంగంలోనైనా సమానమైన లాభాల రేటు ఉండేదే స్వేచ్ఛా పోటీ అని వివరిస్తారు. ఇది ఆచరణలో సాధ్యం కావాలంటే కార్మికులు స్వేచ్ఛగా ఎక్కడికైనా పోగలిగిన పరిస్థితి, పెట్టుబడి కూడా ఎక్కడికైనా సంచరించగల పరిస్థితి ఉండాలి. ఈ రెండింటికీ తోడుగా 'సున్నా లాభాలు' ఉన్నప్పుడు అది 'లోపరహిత పోటీ' అవుతుంది. ఇది సాధ్యపడాలంటే ఏ రంగంలో లాభాలు వస్తున్నాయో ఆ రంగంలోకి ఎందరైనా పెట్టుబడిదారులు అదనంగా ప్రవేశించగలిగే పరిస్థితి ఉండాలి. అలా అందరూ ప్రవేశించగానే ఆ రంగంలో లాభాలు సున్నా అయిపోతాయి. అదనంగా పెట్టుబడిదారులు ప్రవేశించగలగడం అంటే పెట్టుబడి దారీ వర్గంలోకి ఎందరైనా స్వేచ్ఛగా ప్రవేశించగల వీలు ఉండాలి. అంటే కార్మికులు కూడా పెట్టుబడిదారులుగా మారిపోయి లాభాలు వచ్చే రంగంలోకి ప్రవేశించగలగాలి. 'లోపరహిత పోటీ' ఉండాలంటే 'లోపరహితమైన సామాజిక చలనం (ఒక వర్గం నుండి మరొక వర్గంలోకి-ఉదాహరణకు కార్మికవర్గం నుండి పెట్టుబడిదారీ వర్గంలోకి) ఉండాలి. మరోలా చెప్పాలంటే వర్గాలే లేని సమాజం అయివుండాలి. ప్రస్తుత స్థితిలో అది ఊహాజనితమైన స్థితే ఔతుంది. ఈ లోపరహిత పోటీకి కొన్ని ప్రశస్తమైన లక్షణాలు ఉన్నాయి. అందుచేత అటువంటి లోపరహిత పోటీ అనేదే గనుక నెలకొంటే ఆ పోటీ ఫలితంగా నిర్ణయించబడిన ధరల స్థాయి నుండి దారి తప్పడం ఎంతమాత్రమూ మంచిది కాదు.

అయితే కొత్త అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను రూపొందించేటప్పుడు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.వో) ప్రపంచంలో లోపరహిత పోటీ నెలకొని ఉంది అన్న ఊహాజనితమైన నిర్ధారణతో ప్రారంభించింది. అప్పటికి ఉన్న ధరల నుండి దారి మళ్ళడాన్ని ఎంతమాత్రమూ అనుమతించకూడదని ఆదేశించింది. ఏ దేశంలోనైనా సరుకులను ఉత్పత్తి చేసే వారికి గనుక మద్దతు ధరలను గ్యారంటీ చేస్తే అది లోపరహిత పోటీ ఉన్న వాణిజ్యాన్ని దారి మళ్ళిస్తుంది కనుక అటువంటి మద్దతును ఏ దేశమూ అందించకూడదని ఆదేశించింది. అదే సమయంలో అదే ఉత్పత్తిదారులకు నగదు బదిలీ వంటి రూపాలలో మద్దతును అందిస్తే అది లోపరహిత పోటీని ఏ విధంగానూ ప్రభావితం చేయదని చెప్తూ అటువంటి నగదు బదిలీలను మాత్రం అనుమతించింది.

ఈ విధమైన నిబంధన పూర్తిగా అర్థరహితం. ఈ నాటి వాస్తవిక ప్రపంచంలో గుత్త పెట్టుబడిదారుల లాభాలను నియంత్రించాలంటే వారు ఆర్జించే లాభాల రేటు మీద పరిమితులను విధించి అమలు చేయాలి. ఆ విధంగా గుత్త పెట్టుబడిదారుల లాభాల మీద నియంత్రణ అమలు చేయడం డబ్ల్యు.టి.వో దృష్టిలో సరుకుల ధరలను, వాణిజ్యాన్ని దెబ్బ తీసే వ్యవహారంగా పరిగణించబడుతోంది. ఆ పేరుతో గుత్త పెట్టుబడిదారుల మీద ఎటువంటి నియంత్రణలనూ అది అనుమతించదు. ప్రస్తుతం ప్రపంచంలో 'లోపరహిత పోటీ' నెలకొని వుందన్న అర్థం లేని ప్రాతిపదిక మీద డబ్ల్యు.టి.వో వ్యవహరిస్తోంది. ఈ పేరుతో అనేక మూడవ ప్రపంచ దేశాల మీద తన నిబంధనలను రుద్దుతోంది. ఆ దేశాలకు వాస్తవం ఏమిటో తెలిసినా, వాటిని బెదిరించడంతో అవి ప్రశ్నించలేని స్థితిలో తలొగ్గుతున్నాయి. ఈ నిబంధనల పర్యవసానంగా చిన్నరైతుల వ్యవసాయం ప్రమాదంలో పడుతోంది.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలు తమ రైతులకు చాలా భారీ మొత్తంలో సబ్సిడీలు అందిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ సబ్సిడీలు రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను కల్పించే రూపంలో కాకుండా నేరుగా నగదును బదిలీ చేసే పద్ధతిలో రైతులకు అందుతున్నాయి.

తాము అమెరికాతో జరిపే సంప్రదింపులలో రైతుల ప్రయోజనాలకు ఏ ఇబ్బందీ కలుగనియ్యబోము అని ప్రభుత్వం ప్రకటన అయితే చేస్తుంది. కాని అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల మీద ఇప్పుడున్న సుంకాలను ఏ మాత్రం తగ్గించినా, దాని వలన మన రైతులు దెబ్బ తినిపోవడం ఖాయం. ఇప్పుడు సుంకాల విషయంలో అమెరికాతో చర్చలకు అంగీకరించడమే మనకు హానికరం. అమెరికాకు మన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు చాలా తక్కువ. కాని అమెరికన్ ఉత్పత్తులపై మనం గనుక సుంకాలను తగ్గిస్తే అది కేవలం మన దేశంలోని గుత్త పెట్టుబడిదారులకు లాభాన్ని అందించవచ్చేమో గాని రైతాంగం మాత్రం తీవ్రమైన ఇక్కట్ల పాలౌతుంది.

యూరోపియన్ యూనియన్ దేశాలలో, అమెరికాలో రైతులకు అందించే నగదు వాళ్ళు పండించే పంట ధరలో దాదాపు సగం మేరకు ఉంటుంది. జపాన్ లోనైతే దాదాపు రైతు ఉత్పత్తి చేసే పంట మొత్తం విలువ ఎంతో అంత నగదు బదిలీ వారికి చేస్తున్నారు. ఇంతింత భారీ సబ్సిడీలు ఇవ్వడాన్ని డబ్ల్యు.టి.వో తప్పు పట్టదు. ఆ విధమైన నగదు బదిలీలు వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయంపై ఎటువంటి ప్రభావాన్నీ చూపబోవు అన్నది దాని వాదన.

కాని ఇండియా వంటి దేశాల్లో ప్రభుత్వం రైతులకు మద్దతు ధరను ఇస్తుంది. అంటే రైతుల పంటల ధరలు ఒకానొక స్థాయికన్నా దిగువకు పడిపోకుండా తానే ఆ పంటలను ప్రకటించిన ధరకు కొనుగోలు చేస్తుంది. లేదా తాను ప్రకటించిన ధరకే కొనుగోలు చేయాలని ఆదేశిస్తుంది. ఇటువంటి మద్దతు విధానాన్ని డబ్ల్యు.టి.వో అభ్యంతర పెడుతుంది. ఇది ప్రభుత్వం ధరల నిర్ణయంలో అనవసరంగా జోక్యం చేసుకోవడమేనంటుంది. కావాలంటే భారతదేశంలో కూడా అమెరికాలో మాదిరిగా రైతులకు నేరుగా నగదు బదిలీ చేసుకోవచ్చును తప్ప మార్కెట్ ధర ఎంత ఉండాలో నిర్ణయించడంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు అంటుంది. సిద్ధాంతంగా చూస్తే డబ్ల్యు.టి.వో వాదనలో తప్పు లేదు. కాని ఆచరణలో చూస్తే అమెరికాలో కొన్ని వేలమంది మాత్రమే రైతులు ఉన్నారు. కాని భారతదేశంలో కోట్లాదిమంది రైతులు ఉన్నారు, ప్రతీ రైతు ఇంటికీ నేరుగా నగదు ను అందించడం ఆచరణలో సాధ్యమయ్యేది కాదు. కనీస గిట్టుబాటు ధర అమలయ్యేలా చూడడమే ఆచరణలో సాధ్యపడుతుంది. ఇటువంటి మద్దతు ధర విధానాన్ని వ్యతిరేకించడం అంటే సారాంశంలో ఇండియా వంటి దేశాలలో రైతాంగానికి ప్రభుత్వ మద్దతు ఏ రూపానా లేకుండా చేయడమే.

వాణిజ్య పంటలను పండించే రైతుల విషయంలో ఇప్పటికే జరిగింది ఇదే. గతంలో కాఫీ, రబ్బరు, కొబ్బరి తదితర పంటలను పండించే రైతుల ప్రయోజనాల రక్షణ కోసం కాఫీ బోర్డు, కాయిర్ బోర్డు, టీ బోర్డు, రబ్బరు బోర్డు వగైరా సంస్థలను ప్రభుత్వం ఏర్పరచింది. ఇది నయా ఉదారవాద విధానాలు ప్రవేశించక మునుపు పరిస్థితి. ఆ కాలంలో ఈ వాణిజ్య పంటల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పతనమైతే ఈ బోర్డులు రంగంలోకి దిగి ఆ సరుకులను ప్రకటించిన ధరలకు కొనుగోలు చేసేవి. వాటిపై సుంకాల రేట్లను కూడా అందుకు అనుగుణంగా సవరించేవి. కాని నయా ఉదారవాద విధానాలు వచ్చాక ఆ బోర్డులన్నీ రద్దయ్యాయి. వాణిజ్య పంటలకు ఇప్పుడు ఏ విధంగానూ ప్రభుత్వం రక్షణ కల్పించడం లేదు. రక్షణ కరువైనందువల్ల అనేకమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్వతంత్ర భారత దేశంలో నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలయ్యే వరకూ రైతుల ఆత్మహత్యల ఉదంతాలు మనం వినలేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆహార పంటలకు కూడా మద్దతు ధర విధానాన్ని నిలుపు చేయాలని భావిస్తోంది. గతంలో తెచ్చిన నల్ల చట్టాల సారాంశం ఇదే. కాని రైతాంగం ప్రతిఘటనతో ఈ విషయంలో ముందడుగు వేసే ధైర్యం ఇంతవరకూ చేయడలేకపోతున్నది. కాని ప్రభుత్వం మద్దతు ధర విధానాన్ని రద్దు చేసే ఆలోచనను మాత్రం విడనాడలేదు.

ఇప్పుడు ట్రంప్ ముందుకు తెచ్చిన సుంకాల విధానంతో ఈ సమస్య తక్షణ ఎజండాగా మారింది. ట్రంప్ ఇండియాపై విధించిన అధిక సుంకాలకు జవాబుగా ఇండియా కూడా అమెరికా మీద అధిక సుంకాలను విధించి వుంటే దేశంలోని రైతులకు పెద్ద సమస్య ఉండేది కాదు. కాని ఇండియా ట్రంప్ ప్రభుత్వంతో సంప్రదింపులకు అంగీకరించింది. అంటే అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద ఇప్పుడున్న సుంకాలను తగ్గించడానికి సూత్రప్రాయంగా ఒప్పుకున్నట్టే. అప్పుడు రైతుల వ్యవసాయోత్పత్తులకు ఇప్పుడు ఉన్న రక్షణ ఇక ముందు కాలంలో ఉండదు. భారీ ప్రభుత్వ నగదు బదిలీ అండతో అమెరికన్ రైతులు తమ ఉత్పత్తులను మన దేశానికి తెచ్చి ఇక్కడ చాలా తక్కువ రేట్లకు అమ్మగలుగుతారు. ఆ స్థాయికి మన రైతులూ తమ ఉత్పత్తుల ధరలను తగ్గించుకోక తప్పనిసరి పరిస్థితి వస్తుంది. హరిత విప్లవం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మన దేశం స్వయం సమృద్ధి సాధించింది. దాంతో అమెరికన్ ధాన్యాన్ని కొనుగోలు చేయనవసరం లేకుండా పోయింది. అప్పటి నుంచీ అమెరికా ఎలాగైనా మన దేశానికి తన ఆహార ధాన్యాలను ఎగుమతి చేయాలని కలలు కంటూనే వుంది. ఇండియా వంటి అతి పెద్ద ఆహారధాన్య మార్కెట్ మరెక్కడ ఉంటుంది? ఇప్పుడు మోడీ ప్రభుత్వం అమెరికాతో సంప్రదింపులకు అంగీకరించిన కారణంగా అమెరికా కల నెరవేర్చుకునే అవకాశం వచ్చింది.

అదే గనుక జరిగితే అది భారతీయ రైతులను సర్వనాశనం చేస్తుంది. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయి వారి ఆత్మహత్యలు పెరుగుతాయి. బతికిఉన్నవాళ్ళు కూడా దుర్భర దారిద్ర్యం లోకి జారిపోతారు. మరో పక్క మన దేశం సాధించుకున్న ఆహార భద్రత దెబ్బ తింటుంది. ఆహార ధాన్యాల దిగుమతులకు భవిష్యత్తులో మనం అమెరికా దయా దాక్షిణ్యాలపై ఆధార పడవలసి వస్తుంది. దానిని అడ్డం పెట్టుకుని అమెరికన్ పాలకులు మన దేశ విధానాలను తమకు అనుకూలంగా మార్చుకునే వీలు ఏర్పడుతుంది.

అమెరికన్ ఆహారధాన్యాల దిగుమతుల పోటీకి తట్టుకోలేని మన రైతులు ఇతర పంటల సాగు వైపు చూస్తారు. ఎప్పుడు ఏ పంటకు రేటు బాగుంటే ఆ పంటల వైపు మళ్ళుతారు. అప్పుడు అనివార్యంగా ఆ పంటల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పడిపోతాయి. రైతులు కోలుకోలేని స్థితిలో పడిపోతారు. మరోవైపు ఆహారధాన్యాలను అంతర్జాతీయ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడానికి మన దేశానికి విదేశీ మారక ద్రవ్యం చాలా అవసరం పడుతుంది. దాంతో వాటి ధరలు దేశీయంగా పెరుగుతాయి. వాటిని కొనుక్కోలేని స్థితిలోకి ప్రజానీకం నెట్టబడతారు. ఎలా చూసినా దేశం మళ్ళీ కరువు కోరల్లో ఇరుక్కుపోతుంది.


ఆఫ్రికా దేశాల్లో జరిగిందిదే. చాలా ఆఫ్రికన్ దేశాలు ఆహార పంటల సాగునుండి పక్కకు మళ్ళి వాటిని దిగుమతి చేసుకోవడం ప్రారంభించారు. వారు ఎగుమతి చేసే వాణిజ్య పంటల ధరలు అంతర్జాతీయ మార్కెట్ లోఎప్పుడెప్పుడు పడిపోయాయో, అప్పుడల్లా ఆ దేశాలు కరువుకోరల్లో చిక్కుకుపోయాయి. ఇటువంటి కరువును ఆర్థికవేత్త అమియా కుమార్ బాగ్చీ 'ప్రపంచీకరణ కరువు' అని అన్నారు. ఆ ప్రపంచీకరణ వల్లే రైతులు ఆహార ధాన్యాల సాగును విడిచిపెట్టారు కనుకనే వారి కరువుకు కారణం ప్రపంచీకరణ అని ఆయన అన్నారు. ఇప్పుడు ఇండియా కూడా ఆ ఆఫ్రికా దేశాల సరసన చేరిపోయే ప్రమాదం ఉంది. విచిత్రం ఏమంటే ఇప్పుడు ట్రంప్ ప్రపంచీకరణ విధానం నుండి తన దేశాన్ని విడగొట్టుకోవాలని చూస్తున్నాడు. అటువంటి సమయంలో ఆ ప్రపంచీకరణ విధానాలే మన దేశాన్ని అధోగతిపాలు చేస్తున్నాయి.

తాము అమెరికాతో జరిపే సంప్రదింపులలో రైతుల ప్రయోజనాలకు ఏ ఇబ్బందీ కలుగనియ్యబోము అని ప్రభుత్వం ప్రకటన అయితే చేస్తుంది. కాని అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల మీద ఇప్పుడున్న సుంకాలను ఏ మాత్రం తగ్గించినా, దాని వలన మన రైతులు దెబ్బ తినిపోవడం ఖాయం. ఇప్పుడు సుంకాల విషయంలో అమెరికాతో చర్చలకు అంగీకరించడమే మనకు హానికరం. అమెరికాకు మన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు చాలా తక్కువ. కాని అమెరికన్ ఉత్పత్తులపై మనం గనుక సుంకాలను తగ్గిస్తే అది కేవలం మనదేశంలోని గుత్త పెట్టుబడిదారులకు లాభాన్ని అందించవచ్చేమో గాని రైతాంగం మాత్రం తీవ్రమైన ఇక్కట్ల పాలౌతుంది.

(స్వేచ్ఛానుసరణ)

వియత్నాం : యుద్ధాల నుండి అభివృద్ధికి

సందర్భం



కె. రామకృష్ణ

వియత్నాం విజయం సైనిక పరమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సిన అంశాలు. పారదర్శకతతో కూడిన కమ్యూనిజం ప్రజల మద్దతుతో ఎలా విజయవంతం అవుతుందనడానికి వియత్నాం ఉదాహరణ. అంతిమంగా చెప్పాల్సిందేమంటే విజయం అనేది సాధన కాదు, అది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే.

వియత్నాం పేరు వినగానే, ఒక గొప్ప పోరాట చరిత్ర మన కళ్ల ముందు మెదులుతుంది. ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు చూసిన, ఎంతో సహనాన్ని, త్యాగాన్ని నిలబెట్టుకున్న దేశం వియత్నాం. ఇటీవలే హోచిమిన్ సిటీలో జరిగిన వియత్నాం పునరేకీకరణ యాభయ్యవ వార్షికోత్సవ కార్యక్రమానికి వియత్నాం ప్రభుత్వ ఆహ్వానంపై హాజరై వచ్చాను. అక్కడి అనుభవాలు, చరిత్ర, ప్రజల చైతన్యం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి థులామ్ ను మన భారతీయ సంప్రదాయం ప్రకారం సత్కరించే అవకాశం కలిగింది.

వలసల నుండి విజయవంతమైన ప్రజా పాలన దిశగా...

వియత్నాం చరిత్ర అనేది వలస పాలనలపై తిరుగుబాటు, స్వతంత్ర ఉద్యమాల విజయం, ప్రజా కేంద్రిత పాలన వికాసాన్ని చూపిస్తుంది. ఫ్రెంచ్ వలస పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత కొరియా, అమెరికాలతో మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన యుద్ధాలను ఎదుర్కొంది. అమెరికాతో యుద్ధంలో 30 లక్షల మంది చనిపోయారు. 20 లక్షల మంది గాయపడ్డారు. మూడు లక్షల మంది కనిపించకుండా పోయారు. అధునాతన యుద్ధ సామాగ్రి వున్న అమెరికాతో తలపడి 59 వేల మంది అమెరికన్ సైనికులను హతమార్చింది. ఇది వారి పోరాట శక్తికి నిదర్శనం.

కు చి సొరంగాలు

హోచిమిన్ సిటీలోనికు కు చి జిల్లాలో, సుమారు 250 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భూగర్భ సొరంగాలు మానవ శక్తి ఎంత దృఢంగా ఉండగలదో చూపిస్తున్నాయి. ఇవి గెరిల్లా యుద్ధ కేంద్రాలుగా, ఆయుధ నిల్వలుగా, ఆసుపత్రులుగా, వంట గదులుగా, పొలిటికల్ మీటింగ్ రూం లాగా యుద్ధ కాలంలో ఉపయోగించేవారు. 1940లో మొదట ఫ్రెంచ్ వలస పాలనకు ప్రతిఘటనగా తవ్విన టన్నెళ్ళు, అమెరికాతో యుద్ధంలో మరింతగా పెంచి ఉపయోగించారు.

యుద్ధాలే కాదు, రసాయనాల పీడ కూడా

యుద్ధంలో అమెరికా 'ఏజెంట్ ఆరంజ్' లాంటి రసాయనాలు వాడి వియత్నాంను గెలవాలనుకుంది. అయినా వియత్నాం వీరులు వాటిని ఎదుర్కొన్నారు. వీటి వల్ల 30 లక్షల మిలియన్ల మంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. క్యాన్సర్, జనన లోపాలు, శారీరక వైకల్యాలు యుద్ధం ముగిసిన తర్వాత పుట్టిన తరాలపై కూడా ప్రభావం చూపించాయి.

'డోయ్ మోయ్'తో పునర్నిర్మాణం

1986లో ప్రారంభించిన "డోయ్ మోయ్" ఆర్థిక సంస్కరణల ద్వారా, వియత్నాం కేంద్ర ప్రణాళిక విధానాల నుంచి మార్కెట్ ఆధారిత విధానాల వైపు సాగింది. అయితే, ప్రజల అవసరాలే కేంద్రబిందువుగా కొనసాగాయి. ఫలితంగా పేదరికం 70 శాతం నుంచి 1.9 శాతానికి తగ్గింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కొత్త పుంతలు తొక్కి విజయవంతం కాగలిగింది.

వికాస పథంలో వియత్నాం

1975 యుద్ధం తర్వాత వియత్నాం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 నాటికి 70 శాతం ప్రజలు పేదరికంలో జీవించేవారు. అటువంటి పరిస్థితిలో 1986లో 'డోయ్ మోయ్' పేరుతో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది. ఫలితంగా పేదరికం 70 శాతం నుంచి 1.9 శాతానికి తగ్గింది. విదేశీ పెట్టుబడులకు అవకాశాలు ఇచ్చినప్పటికీ ప్రజల ప్రయోజనాలే కేంద్రంగా ఉంటున్నాయి. 1990 తర్వాత వియత్నాం జిడిపి ఏటా 6 శాతానికి పైగా పెరుగుతూనే ఉంది. 2024లో వియత్నాం జిడిపి 476.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇది 2023లోని 5.05 శాతం వృద్ధితో పోలిస్తే 7.09 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఎగుమతులు 14.3 శాతం పెరిగి 405.53 బిలియన్ డాలర్లకు చేరాయి, ఇది దేశ ఆర్థిక వృద్ధికి ముఖ్య కారణం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 9.4 శాతం పెరిగి 25.35 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసింది. ఇదంతా కమ్యూనిస్టు పాలనలో వియత్నాం సాధించిన అభివృద్ధి.

వియత్నాంలో సైన్యానికి, యువతకు ప్రాధ్యాన్యత ఇస్తున్నట్లు కనబడింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉత్తర, దక్షిణ వియత్నాంల ఏకీకరణ యాభయ్యవ వార్షికోత్సవంలో ఆర్మీ మేజర్ జనరల్ చాన్ నాక్ థు, యువత తరఫున ఒక యువతి మాట్లాడారు.



ప్రజల మద్దతుతో...

వియత్నాం విజయం సైనిక పరమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సిన అంశాలు. పారదర్శకతతో కూడిన కమ్యూనిజం ప్రజల మద్దతుతో ఎలా విజయవంతం అవుతుందనడానికి వియత్నాం ఉదాహరణ. అంతిమంగా చెప్పాల్సిందేమంటే విజయం అనేది సాధన కాదు, అది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే. ఈ ఉత్సవాలకు స్పెయిన్ నుండి వచ్చిన మహిళా ప్రతినిధి నా పక్కనే కూర్చుని వున్నపుడు 'ఇక్కడ ప్రతిపక్షం లేకుండా ప్రజల అసంతృప్తి వంటివి ఎలా ఉండవా?' అన్న చర్చ వచ్చింది. దానికి ఆమె తానే సమాధానమిస్తూ, 'ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేసి వారికి అవసరమైనవి సమకూర్చగలిగితే వారిలో అసంతృప్తికి చోటుండదు. బహుళ పార్టీ వ్యవస్థతో వాళ్లకు పనీ లేదు' అని పేర్కొన్నారు. ఇది వియత్నాం విజయ రహస్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం.

/ వ్యాసకర్త సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి /

అభిప్రాయం

ఆస్తమాతో జాగ్రత్త

(మే 6 'ప్రపంచ ఆస్తమా దినం')

దీర్ఘకాలిక అసాంక్రమిక లేదా అంటువ్యాధి కాని (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) వ్యాధుల్లో ఆస్తమా లేదా ఉబ్బసం అతి ప్రధానమైనది. ప్రపంచ్యాప్తంగా సాలీనా 26 కోట్ల ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని, అందులో 4.5 లక్షల వరకు మరణాలు కూడా సంభవిస్తున్నాయని అంచనా. భారత్‌లో అత్యధిక ఉబ్బస రోగులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అయితే ఆస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించవచ్చు. కలుషిత గాలి, శీతల గాలులు, పూల సుగంధ పరిమళాలు, దుమ్ము ధూళి, సిగరెట్టు పొగలు, బాణాసంచా కాల్చడం, అగరు వత్తుల పొగలు, ఫేస్ పౌడర్ పీల్చడం, ఎలర్జీకి కారణమయ్యే వాటికి దూరంగా ఉండడం వల్ల ఉబ్బసం నివారించబడుతుంది లేదా వ్యాధిగ్రస్థుల్లో ఉపశమనం కలుగుతుంది. వీటితోపాటు రోగులకు దూరంగా ఉండడం, శీతల వాతావరణాలకు దూరంగా ఉండడం, ఇల్లు/ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, అందుబాటులో ఉన్న అన్ని వ్యాధుల కట్టడికి టీకాలను తీసుకోవడం, వైద్యుల సూచనలతో తగు ఔషధాలను విధిగా వాడడం తప్పనిసరి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

అదానీని కాపాడండి

ట్రంప్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కంపెనీ భారత ప్రతినిధులు

న్యూయార్క్ : అమెరికాలో వచ్చిన క్రిమినల్ ఆరోపణల నుండి పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని బయటపడేసేందుకు అదానీ గ్రూప్ నానా తంటాలు పడుతోంది. ఇందులో భాగంగా ట్రంప్ ప్రభుత్వంలోని కొందరు అధికారులతో సమావేశమైందని బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, అమెరికా ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న చర్చలు ఇప్పటివి కావని, ఈ సంవత్సరం ప్రారంభం నుండే అవి కొనసాగుతున్నాయని ఆ వార్తా సంస్థ వివరించింది. న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్‌లో ఉన్న అమెరికా అటార్నీ కార్యాలయంతోనూ, న్యాయ మంత్రిత్వ శాఖతోనూ మార్చిలోనే సమావేశం జరిగింది. 'ఈ ఏడాది ప్రారంభంలో మొదలైన చర్చలు ఇటీవలి వారాలలో మరింత ఊపందుకున్నాయి. చర్చలు ఇదే ఊపులో కొనసాగితే వచ్చే నెలలో అవి ఒక కొలిక్కి రావచ్చు. సంప్రదింపులు రహస్యంగా జరుగుతున్నందున వాటి వివరాలు బయటపెట్టలేమని కొందరు వ్యక్తులు తెలిపారు' అని బ్లూమ్‌బర్గ్ వివరించింది. అదానీని విచారించే అంశం దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రాధాన్యతల్లో ఉండకుండా చూసేందుకు కొందరు ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీనిపై పునరాలోచన చేయాలని వారు వేడుకుంటున్నారు.

భారత్‌లో విద్యుత్ కాంట్రాక్టులు పొందేందుకు 265 మిలియన్ డాలర్ల మేర ముడుపులు ముట్టజెప్పారని, నిధుల కోసం అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ గౌతమ్ అదానీ, ఆయన అన్న కొడుకు, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ, మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ ఎస్. జైన్‌లపై గత సంవత్సరం నవంబరులో అమెరికా న్యాయ మంత్రిత్వ శాఖ అభియోగాలు మోపింది. అదానీ గ్రూపుకు చెందిన ఇద్దరు డైరెక్టర్లపై అమెరికా సెక్యూరిటీలు - ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సివిల్ ఫిర్యాదు కూడా చేసింది. తనపై వచ్చిన ఆరోపణలను నిరాధారమంటూ అదానీ గ్రీన్ సంస్థ తోసిపుచ్చింది. వాటిపై స్వతంత్ర సమీక్ష కోసం న్యాయ సంస్థలను నియమించింది. ఎలాంటి అవకతవకలు జరగలేదంటూ ఆ సంస్థలు అదానీకి క్లీన్‌చిట్ ఇచ్చాయి. కాగా అభిశంసనను ఎదుర్కొంటున్న వినీత్ జైన్ పదవీకాలాన్ని అదానీ గ్రీన్ మరో ఐదు సంవత్సరాలు పొడిగించడం గమనార్హం.

విదేశీ చలనచిత్రాలపై వంద శాతం పన్ను

ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ : విదేశీ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్ను ఇప్పుడు ఇతర దేశాలలో నిర్మించిన సినిమాలపై పడింది. విదేశీ భూభాగాలపై నిర్మించే సినిమాలపై వంద శాతం సుంకం విధిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలులోకి తేవాలని ఆయన అమెరికా వాణిజ్య శాఖకు, వాణిజ్య ప్రతినిధులకు అప్పగించారు. అయితే ఈ నిర్ణయాన్ని ఎలా అమలు చేస్తారో ఆయన వివరించలేదు. 'ఇతర దేశాలు మన నిర్మాతలను, స్టూడియోలను అమెరికా నుండి దూరం చేయడానికి అనేక రాయితీలు అందజేస్తున్నాయి. దీనివల్ల అమెరికాలోని హాలీవుడ్, అనేక ఇతర ప్రాంతాలు నాశనమై పోతున్నాయి. అన్ని దేశాలు కలిసి సమిష్టిగా ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి. కాబట్టి ఇది దేశ భద్రతకు ముప్పు' అని ట్రంప్ తెలిపారు. ప్రభుత్వం తాజా చర్యతో వాల్ట్ డిస్నీ కంపెనీ, పారామౌంట్ గ్లోబల్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ వంటివి నష్టపోతాయి. 'చైనాపై అధిక సుంకాలు విధించిన ట్రంప్ తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా అమెరికా సినిమాలపై మా ప్రేక్షకుల్లో ఉన్న సానుకూలత బాగా తగ్గిపోతుంది' అని చైనా ఫిల్మ్ అడ్మినిస్ట్రేషన్ గత నెల 10వ తేదీన ఒక ప్రకటనలో తెలియజేసింది.

వరిలో జన్యు మార్పిడి

- నూతన రకాలను అభివృద్ధి చేస్తున్న కేంద్రం
- దీనిపై ఇప్పటికే వివాదం...
- సుప్రీంకోర్టులో కేసు
- అయినా తగ్గని ప్రభుత్వం



న్యూఢిల్లీ : దేశంలో ధాన్యం దిగుబడిని 30 శాతం పెంచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జన్యుపరంగా మార్పులు చేసిన రెండు వరి రకాలను అభివృద్ధి చేసోంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ విషయాన్ని ప్రకటించారు. దేశంలో జన్యు మార్పిడికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై వివాదం కొనసాగుతోంది. పైగా దానిపై న్యాయస్థానాలలో కేసులు కూడా నడుస్తున్నాయి. అయినప్పటికీ కేంద్రం ఆ దిశగా అడుగులు వేయాలని నిర్ణయించడం గమనార్హం. జన్యుపరంగా మార్పులు చేసిన కమల రకంతో ఉత్పాదకత 30 శాతం, పూసా డిఎస్‌టి రైస్ 1 రకంతో 20 శాతం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇవి కరువు పరిస్థితులను తట్టుకుంటాయని, ముందుగానే కోతకు వస్తాయని, మీథేన్‌ను తక్కువ ఉత్పత్తి చేస్తాయని, నత్రజని అవసరం కూడా తక్కువేనని వారు అంటున్నారు. వ్యవసాయ రంగంలో జన్యు మార్పిడికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించవచ్చా లేదా అనే అంశం గత రెండు దశాబ్దాలుగా అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. బయోసేఫ్టీ పరీక్షలో సానుకూల ఫలితాలు రాకుండానే దేశంలో ఈ పరిజ్ఞానాన్ని ఎందుకు అనుమతిస్తున్నారని 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ప్రతినిధి ప్రశ్నించినప్పుడు 1989వ సంవత్సరపు పర్యావరణ (పరిరక్షణ) చట్టంలోని జీవ భద్రతా నిబంధనల నుండి ఈ రెండు రకాలు మినహాయింపు పొందాయని చౌహాన్ బదులిచ్చారు. 'ఉత్పాదకతను పెంచి, ఆశించిన ఫలితాలు సాధించడానికి స్థానిక పంట రకాల నుండి సజీవంగా ఉన్న జీవులను ఉపయోగించడమే జన్యు సాంకేతిక పరిజ్ఞానం. బ్యాక్టీరియాను చేర్చడం కంటే ఇది ఉత్తమమైన పద్ధతి. కాబట్టి దానికి నియంత్రణలు ఉండవు' అని వివరించారు.

ఈ కొత్త రకాలు రైతులకు చేరుకోవడానికి నాలుగైదు సంవత్సరాల కంటే ఎక్కువ సమయమే పడుతుంది. 'మేము ఇప్పుడు జాతిని అభివృద్ధి చేశాము. ఫౌండేషన్ విత్తనాలను అభివృద్ధి చేయడం, ధృవీకరణ పొందడం వంటి పనులకు కనీసం నాలుగైదు సంవత్సరాలు పడుతుంది' అని చౌహాన్ చెప్పారు. ఈ రకాలు రైతులకు చేరిన తర్వాత వరి విస్తీర్ణాన్ని క్రమేపీ ఐదు మిలియన్ హెక్టార్లు తగ్గించి పది మిలియన్ టన్నుల ఉత్పత్తిని పెంచుతామని తెలిపారు. వరి పండించే విస్తీర్ణాన్ని తగ్గించి ఆ భూములలో రాబోయే సంవత్సరాలలో నూనె గింజలు, పప్పు ధాన్యాల పంటలు వేస్తామని, తద్వారా వాటిలో స్వయం సమృద్ధి సాధిస్తామని అన్నారు. అరటి, గోధుమ, ఆవాలు, పొగాకు, పత్తి, తేయాకు వంటి పంటలలో జన్యు మార్పిడి ప్రాజెక్టులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పొద్దుతిరుగుడు, సోయాబీన్, వేరుశనగ, శనగలు, మినుములు, కందులు వంటి చమురు గింజలు, పప్పు ధాన్యాల పంటల్లో కూడా జన్యుపరమైన మార్పులు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సిఎంఎఫ్ ఫోన్ 2 ప్రో విక్రయాలు షురూ..

బెంగళూరు : లండన్ ఆధారిత టెక్నాలజీ కంపెనీ సిఎంఎఫ్ తన ఫోన్ 2 ప్రో విక్రయాలను సోమవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపింది. ఈ ఫోన్‌ను పలు ఆఫర్లతో రూ.16,999కే అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఫోన్‌ను ఏప్రిల్ 28న అంతర్జాతీయంగా విడుదల చేయగా.. భారత్‌లో తాజాగా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఇందులో 50 ఎంపి ప్రధాన కెమెరా సహా సెల్ఫీ కోసం 16 ఎంపి కెమెరాను అమర్చింది.

30 ఫైటర్ జట్లతో యెమెన్‌పై విరుచుకుపడిన ఇజ్రాయిల్

గాజా : యెమెన్‌పై ఇజ్రాయిల్ ప్రతీకార దాడులకు దిగింది. పటిష్టమైన భద్రతా వ్యవస్థను దాటుకుని ఇజ్రాయిల్‌లోని బెన్ గురియన్ ఎయిర్‌పోర్టుపై హౌతీలు ఆదివారం మిసైల్ దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా 30 ఫైటర్ జెట్లతో సోమవారం రాత్రి ఇజ్రాయిల్ యెమెన్‌పై విరుచుకుపడింది.

గాజాలో 51 మంది మృతి

మరోవైపు సోమవారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మారణ హోమం కొనసాగించింది. 51 మంది మరణించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఆహార సరఫరాను ఇజ్రాయిల్ సైన్యం నిలిపివేయడంతో ఆకలి చావులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ తీరుపై ఐక్యరాజ్యసమితితో పాటు దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నాలుగో స్థానానికి తగ్గిన హ్యుండాయ్

- 40 శాతం దిగువకు మారుతి మార్కెట్ వాటా

న్యూఢిల్లీ : భారత ఆటోమొబైల్ రంగంలో చాలా కాలం రెండో అతిపెద్ద సంస్థగా కొనసాగిన హ్యుందాయ్ మోటార్ ఇండియా అనూహ్యంగా తన మార్కెట్ వాటాను కోల్పోయింది. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్‌ఎడిఎ) గణాంకాల ప్రకారం.. హ్యుందాయ్ మోటార్స్‌ను అధిగమించి మహీంద్రా అండ్ మహీంద్రా రెండో స్థానంలోకి వచ్చింది. దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ మార్కెట్ వాటా 40 శాతం దిగువకు పడిపోయింది. టాటా మోటార్స్ మాత్రం యథాతథంగా మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దేశీయంగా 3.49 లక్షల పాసింజర్ వాహనాల విక్రయాలు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 3.44 లక్షల వాహన విక్రయాలతో పోలిస్తే 1.55 శాతం పెరుగుదల ఉంది. కాగా.. మారుతీ సుజుకీ గతేడాది ఏప్రిల్‌లో 1,38,021 యూనిట్లను విక్రయించి 39.44 శాతం మార్కెట్ వాటాకు పరిమితమయ్యింది. గతేడాది ఇదే నెలలో 40.39 మార్కెట్ వాటాను కలిగి ఉంది. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) వేగంగా రెండో స్థానంలోకి వచ్చింది. ఈ సంస్థ ఏప్రిల్‌లో 48,405 వాహనాలు విక్రయించి 13.83 శాతం మార్కెట్ వాటాను సాధించి.. రెండో స్థానంలో నిలిచింది. ఇంతకాలం రెండో స్థానంలో ఉన్న హ్యుందాయ్ ఏప్రిల్‌లో 43,642 యూనిట్లు అమ్మకాలతో 12.47 శాతం మార్కెట్ వాటాతో నాలుగో స్థానానికి పరిమితమైంది.

స్విగ్గీ 'జీనీ' సేవలకు గుడ్‌బై

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తన వస్తువుల పికప్ అండ్ డ్రాప్ కోసం తీసుకొచ్చిన స్విగ్గీ 'జీనీ' సేవలను నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బెంగళూరు, ముంబయి, న్యూఢిల్లీ తదితర చోట్ల ప్రస్తుతం ఈ సేవలు లభించడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా అందుబాటులో లేవని చెబుతోంది. 2020 ఏప్రిల్‌లో స్విగ్గీ ఈ జీనీ సేవలను ప్రారంభించింది.. దాదాపు 70 నగరాలకు విస్తరించింది. సేవల రద్దుపై స్విగ్గీ అధికారికంగా ప్రకటన చేయలేదు.

సామ్‌సంగ్ ఉత్పత్తులపై 65 శాతం డిస్కౌంట్

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ ఈ వేసవి కాలం సందర్భంగా ఫ్యాబ్ గ్రాబ్ ఫెస్ట్‌లో తమ ఉత్పత్తులపై 65 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపింది. గెలాక్సీ ఎస్ సిరీస్, జడ్ సిరీస్, ఎ సిరీస్ ఫోన్లపై 41 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తోన్నట్లు పేర్కొంది. టాబ్లెట్లు, ఉపకరణాలు, ఫిట్‌బాండ్ వస్తువులపై 65 శాతం వరకు, వాషింగ్ మిషన్లు, రిఫ్రిజిరేటర్లపై 43 శాతం, విడ్‌ఫ్రీ ఏసిలపై 58 శాతం వరకు తగ్గింపు ఇస్తోన్నట్లు పేర్కొంది.

'వక్ఫ్' సవరణ ఒక కుట్ర


కల్బుర్గీలో సభకు హాజరైన ప్రజానీకం

- కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి : బృందాకరత్
- రాజ్యాంగ విరుద్ధం : డి.రాజా
- కర్ణాటకలో కులమతాలకు అతీతంగా భారీ నిరసన

బెంగళూరు : ఒక మత విశ్వాసాలను దెబ్బతీసేలా కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఆందోళనలు కొనసాగుతున్నాయి. వక్ఫ్ సవరణ చట్టం 2025పై తాజాగా కర్ణాటకలోని కల్బుర్గీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం జరిగింది. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుల, మత, సిద్ధాంతాలు, పార్టీలతీతంగా పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. పౌర సంఘాలు, దళిత సంస్థలు, హిందూ, సిక్కు, క్రైస్తవ, బౌద్ధ మతాలకు చెందిన నేతలు, మత పెద్దలు సైతం ఇందులో పాలుపంచుకున్నారు కేంద్రం చర్యలపై తీవ్రంగా స్పందించారు. మోడీ సర్కారు తీరును తప్పుబడుతూ అసమ్మతిని తెలిపారు. కమలం పార్టీ విభజన రాజకీయాలకు వ్యతిరేంగా తమ ఐక్యతను ప్రదర్శించారు. దేశంలో మైనారిటీ హక్కుల రక్షణలో భాగంగా సర్వమత ఐక్యతకు ఇది ఒక అరుదైన ఉదాహరణగా నిలిచింది.

పీర్ బంగాలి మైదానంలో దాదాపు ఆరు గంటల పాటు ఈ కార్యక్రమం జరిగింది. వేలాది మంది ముస్లిములతోపాటు అన్ని మతాల వారు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025ను నిరసించారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న చట్టం : బృందా కరత్



జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి బాధితులకు నివాళు లర్పించటంతో సహా పలు ఉద్వేగభరితమైన ప్రసంగాలు, గంభీరమైన క్షణాలు ఈ కార్యక్రమంలో కనిపించాయి. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు బృందాకరత్ పాల్గొన్నారు. ముస్లింలదే కాకుండా రైతులు, ఆదివాసీలు, పేదలకు చెందిన భూమిని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకునే చర్యగా వక్ఫ్ చట్టం సవరణను ఆమె అభివర్ణించారు. "ప్రభుత్వ చర్య వక్ఫ్ ఆస్తుల గురించి మాత్రమే కాదు. సరైన పట్టాలు లేని ఆదివాసీల వంటి లక్షలాది మంది నుంచి భూమిని లాక్కోవటానికి ఇది కుట్ర. మూడు వేల సంవత్సరాల నాటి రికార్డులు లేనందున వక్ఫ్ భూములను ప్రశ్నిస్తే.. భూమిలేని పేదల సంగతేంటి? కేంద్రం చర్యలను వ్యతిరేకించేందుకు మనమంతా ఐక్యంగా నిలబడాలి" అని ఆమె అన్నారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ఉల్లంఘన అని తెలిపారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా, వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణను పెంచేలా కొత్త చట్టం వీలు కల్పిస్తుందని యావత్ ముస్లిం సమాజంతో పాటు మేధావులు, నిపుణులు, విపక్ష నేతల నుంచి ఇప్పటికే అనేక ఆందోళనలు వ్యక్తమైన విషయం విదితమే.

తీవ్ర ప్రమాదంలో లౌకికవాదం : డి. రాజా



వక్ఫ్ చట్టానికి కేంద్రం తీసుకొచ్చిన సవరణలను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా వ్యతిరేకించారు. దానిని రాజ్యంగ విరుద్ధం, మైనారిటీ వ్యతిరేకమని ఖండించారు. వక్ఫ్ చట్టం సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. " భారత్‌ను దైవపరిపాలనా రాజ్యంగా మార్చాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై ఒత్తిడి చేశారు. ఆయన లౌకికవాదం వైపు దృఢంగా నిలబడ్డారు. నేడు, ఆ లౌకికవాదం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నది. ఈ చట్టం మన రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుంది. భారత్‌ను, రాజ్యాంగాన్ని కాపాడటానికి.. ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని మనం తొలగించాలి" అని రాజా అన్నారు.

ఉగ్రదాడి బాధితులకు రెండు నిమిషాలు మౌనం

పహల్గాం ఉగ్రదాడిలో బాధితులకు నివాళు లర్పించేందుకు ఈ కార్యక్రమం రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ కార్యక్రమానికి కర్నాటక రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్, దర్గా హజ్రత్ ఖ్వాజా బందనవాజ్‌కు చెందిన సజ్జాదా నషిన్, హఫీజ్ సయ్యద్ ముహమ్మద్ అలీ అల్ హుస్సేని అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో కర్ణాటక మంత్రి ప్రకాశ్ పాటిల్, రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నసీర్ హుస్సేన్, కలబురగి ఉత్తర ఎమ్మెల్యే కనీజ్ ఫాతిమా, ఎఐఎంపిఎల్‌బి సభ్యుడు మౌలానా అబూ తాలిబ్ రహ్మానీ, ఇల్కల్‌లోని చిత్తరాగి సంస్థాన్ మఠాధిపతి గురు మహంత్ స్వామీజీ, జామియా నిజామియా వైస్ ప్రిన్సిపాల ముఫ్తీ సయ్యద్ జియావుద్దీన్, సిక్కు సంఘం నాయకుడు గుర్మీత్ సింగ్ సలూజా, గుర్మీత్‌కల్‌లోని ఖాసా మఠాధిపతి శాంతవీర స్వామి, ఎస్‌డిపిఐ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మాజీద్, బీదర్‌లోని అనదూర్ బుద్ధ విహారానికి చెందిన భంటే వరజ్యోతి థెరోతో పాటు కేంద్ర మాజీ మంత్రి సిఎం ఇబ్రహీం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


పాట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ బేబి

బిజెపి ఓటమికి వ్యూహ రచన

- అన్ని పక్షాలు సమన్వయంతో పనిచేయాలి
- బీహార్ ఎన్నికలపై ఎంఎ బేబి

పాట్నా : రాబోయే బీహార్ శాసనసభ ఎన్నికలలో బిజెపిని ఓడించడానికి ప్రతిపక్షాలు సమన్వయంతో కూడిన వ్యూహాన్ని రూపొందించుకోవాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఆయన సోమవారం తొలిసారి బీహార్ వచ్చారు. రాష్ట్రంలో మహా ఘట్ బంధన్‌కు జవసత్వాలు కల్పించేందుకు వామపక్షాలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆయన పాట్నా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పాట్నా విమానాశ్రయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలలో బిజెపిని మట్టికరిపించాలంటే మహా ఘట్ బంధన్ భాగస్వామ్య పక్షాలు కలసికట్టుగా వ్యూహాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.

'బీహార్‌లో రానున్న కీలక ఎన్నికలలో బిజెపిని ఎలా ఓడించాలి, మహాగట్‌బంధన్‌ను ఎలా బలోపేతం చేయాలి అనే విషయాలపై మా పార్టీ నాయకులతో చర్చలు జరుగుతాయి. ఈ చర్చల ఫలితాలను మేము మీడియాకు తెలియజేస్తాము' అని బేబి చెప్పారు. వామపక్ష పార్టీలు దేశవ్యాప్త ఆందోళనకు ప్రణాళికలు రూపొందిస్తున్న తరుణంలో బేబి బీహార్‌లో పర్యటిస్తున్నారు. కార్మికుల హక్కుల సాధనకు ఈ నెల 20న అఖిల భారత సమ్మె జరగనుంది. ఆదివారం జరిగిన మహాగట్‌బంధన్ సమావేశంలో సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు సిపిఐ (ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య తెలిపారు. వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేస్తామని ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ చెప్పారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత డాక్టర్ షకీల్ అహ్మద్ ఖాన్ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని దుయ్యబట్టారు. నితీష్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కాగా బీహార్‌లో ప్రతిపక్ష కూటమి కార్యాచరణ ప్రణాళికకు రూపం ఇచ్చే విషయంలో వామపక్షాలు కీలక పాత్ర పోషించబోతున్నాయి.

తెలంగాణాలో భూప్రకంపనలు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని పలు జిల్లాల్లో సోమవారం రాత్రి భూమి స్వల్పంగా కంపించింది. కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలతోపాటు జయశంకర్ భూపాలపల్లి, సిరిసిల్ల జిల్లాలలోని పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత 3.8గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

అమెరికాతో దౌత్యానికి కట్టుబడి వున్నాం

- ఇరాన్ స్పష్టీకరణ

దుబాయ్ : అమెరికాతో దౌత్యానికి తాము కట్టుబడి వున్నామని ఇరాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. రోమ్‌లో గత శనివారం అమెరికాతో జరగాల్సిన నాల్గవ దఫా అణు చర్చలు వాయిదా పడిన నేపథ్యంలో ఇరాన్ ఈ విషయం వెల్లడించింది. చర్చలు, దౌత్య పంథాను కొనసాగించేందుకు నిబద్ధతతో వున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె సోమవారం తెలిపారు. ఇప్పటికే పలు దఫాలుగా జరిగిన చర్చల్లో కూడా తాము పాల్గొని పూర్తి సన్నద్ధతను ప్రదర్శించామని చెప్పారు. చర్చల సమయానికి సంబంధించి కూడా తాము వెసులుబాటు ధోరణితోనే వ్యవహరిస్తున్నామని చెప్పారు. తదుపరి చర్చలు ఎప్పుడనే విషయమై మధ్యవర్తి ఒమన్ నుండి వివరాలు అందడం కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు. చర్చలు జరుపుతున్న అమెరికా ప్రతినిధి బృందం వ్యవహార శైలి, వైఖరులు ఎలా వున్నాయనేదే తమకు అత్యంత కీలకమైన అంశమని బాఘె స్పష్టం చేశారు. అమెరికా అధికారులు చేసే పరస్పర విరుద్ధమైన ప్రకటనల వల్ల ఎలాంటి ఉపయోగం వుండదన్నారు. పైగా తమ ప్రాథమిక వైఖరులను సమర్ధించుకునే అంశంపై టెహరాన్ నిబద్ధతపై ఎలాంటి ప్రభావం చూపలేదని కూడా స్పష్టం చేశారు. యురేనియంను దేశీయంగా శుద్ధి చేసుకోవడంతో ఇరాన్ హక్కు అని దానిపై ఎలాంటి వాదనలకు తావు లేదని బాఘె పునరుద్ఘాటించారు. అణు కార్యక్రమానికి కావాల్సిన యురేనియంను శుద్ధి చేసుకోవడం కన్నా దిగుమతి చేసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఈ నెల 1న సూచించిన నేపథ్యంలో ఇరాన్ తన వైఖరి స్పష్టం చేసింది.

స్పెషల్ డిఎస్‌సిపై కేబినెట్‌లో చర్చిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు ఆమెను సాలూరులోని క్యాంపు కార్యాలయంలో సోమవారంకలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సితో గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. అన్ని ఐటిడిఎల పరిధిలోని ఉపాధ్యాయ పోస్టులను మెగా డిఎస్‌సి నుంచి మినహాయించి ఈ పోస్టులకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ, ఈ నెల 8న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో వీటిపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రితో భేటీ అనంతరం నాయకులు మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో సానుకూల నిర్ణయం రాకపోతే 9న సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 15తో డిఎస్‌సి దరఖాస్తుకు గడువు ముగియనుందని, ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 3కు ప్రత్యామ్నాయ జిఒ లేదా ఆర్డినెన్సు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో కుడుముల కాంతారావు, వెంకటరమణ, రామస్వామి చెండా కేశవరావు, కె.సత్యనారాయణ, మర్రి చిట్టిబాబు, సీదరపు అప్పారావు, పి.దేముడు, తదితరులు ఉన్నారు.

7న మాక్ డ్రిల్స్

- పలు రాష్ట్రాలను కోరిన కేంద్ర హోం శాఖ
- రక్షణ కార్యదర్శితో మోడీ భేటీ
- బాగ్లీహార్ డ్యామ్ నుండి నీటి విడుదల నిలిపివేత
- సైనిక పరిష్కారం సరైంది కాదు : ఐరాస చీఫ్

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దేశ భద్రతా సన్నద్ధతను పెంచుతూ కేంద్రం కొన్ని చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పౌరుల రక్షణకు సంబంధించి బుధవారం 7వ తేదీన మాక్ డ్రిల్స్ నిర్వహించాల్సిందిగా పలు రాష్ట్రాలను కేంద్ర హోం శాఖ కోరింది. వైమానిక దాడులు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో ఈ మాక్ డ్రిల్స్‌లో తెలియజేయాల్సిందిగా కోరింది. వైమానిక దాడులు జరగడం వంటి అత్యవసర సమయాల్లో ఎలా ప్రతిస్పందించాలో ప్రజలకు నేర్పించాలని కోరింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్ము కాశ్మీర్, పంజాబ్, హర్యానా, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ మాక్ డ్రిల్స్‌ను నిర్వహించాలని సూచించింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ త్రివిధ దళాల అధిపతులు, ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయన సోమవారం రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఆదివారం వైమానిక దళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్, మోడీతో సమావేశమైన విషయం తెలిసిందే.

ఐఇడిల ధ్వంసం

ఇదిలావుండగా జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల స్థావరాన్ని భద్రతా దళాలు కనిపెట్టాయి. అందులో నుంచి ఐదు ఐఇడిలు, రెండు వైర్‌లెస్ సెట్లను స్వాధీనం చేసుకున్నాయి. అర కిలో నుండి ఐదు కిలోల వరకూ బరువున్న ఈ ఐఇడిలను ధ్వంసం చేశారు. తద్వారా సరిహద్దు జిల్లాలో పేలుళ్లకు పాల్పడాలనుకున్న ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేశారు.

పాక్‌పై మరో సర్జికల్ స్ట్రైక్ !
బాగ్లీహార్ డ్యామ్ నీటి విడుదల

పాకిస్తాన్‌పై భారత్ మరో సర్జికల్ స్ట్రైక్ జరిపింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా బాగ్లీహార్ డ్యామ్ నుండి నీటి విడుదలను నిలిపివేసింది. చీనాబ్ నదిపై నిర్మించిన ఈ ఆనకట్ట ద్వారా పాకిస్తాన్‌కు నీరు చేరుతుంది. ఇప్పటికే చీనాబ్ నదిపై ఉన్న సలాల్ డ్యామ్ అన్ని గేట్లను భారత ప్రభుత్వం మూసివేసింది. దీంతో సోమవారం రియాసి జిల్లాలో నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. జమ్ము కాశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో భారీగా వర్షాలు పడడంతో ఈ నెల 2న చీనాబ్ నది నీటి మట్టం పెరిగింది.

జీలం నదిపై నిర్మించిన కిషన్‌గంగ డ్యామ్ నుండి పాక్‌కు చేరుతున్న నీటిని కూడా నిలిపివేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. జమ్మూలోని రాంబన్‌లో బాగ్లీహార్ జలవిద్యుత్ డ్యామ్ ఉండగా ఉత్తర కాశ్మీర్‌లో కిషన్‌గంగ జలవిద్యుత్ డ్యామ్ ఉంది. ఈ రెండు ఆనకట్టల నుండి నీటి విడుదలను భారత్ నియంత్రించవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య బాగ్లీహార్ డ్యాంపై దీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఈ వివాదంలో ప్రపంచబ్యాంక్ జోక్యం చేసుకోవాలని పాకిస్తాన్ డిమాండ్ చేస్తోంది. జీలంకు ఉపనది అయిన నీలంపై కిషన్‌గంగ డ్యాం ప్రభావం చూపుతుందంటూ పాక్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

చర్చలకు సహాయం చేస్తాం : యుఎన్ చీఫ్

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సోమవారం సమావేశమై భారత్, పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై చర్చించింది. సైనిక పరిష్కారం అసలైన పరిష్కారం కాదని స్పష్టం చేసింది. పహల్గాం ఘటనకు కారకులైన వారికి కఠిన శిక్ష పడాల్సిందేనని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు ఇరు దేశాల మధ్య చర్చలు జరిగేలా తాము సాయం చేస్తామని కూడా ఆయన ప్రతిపాదించారు. ఇరుగు పొరుగు దేశాల మధ్య శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

బంకర్లకు మరమ్మతులు చేయాలి

జమ్మూ సరిహద్దు ప్రాంతాల్లోని బంకర్లకు అత్యవసరంగా మరమ్మతులు చేయాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పాకిస్తానీ పోస్టులకు కేవలం 500మీటర్ల దూరంలోని చందు చాక్ వంటి గ్రామాల్లో అనేక బంకర్లు వున్నాయి. కానీ వాటిల్లో చాలా వరకు పూర్తి కాకుండా వున్నాయి. మరికొన్ని శిథిలావస్థలో వున్నాయి. నీరు, విద్యుత్, టాయిలెట్లు వంటి ప్రాథమిక సదుపాయాలేవీ లేవని కొన్నిటికి పైకప్పులు కూడా లేవని ఆ గ్రామ నివాసి ఒకరు వాపోయారు.

జపాన్ మద్దతు



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం జపాన్ రక్షణ శాఖ మంత్రితో జనరల్ నకతానితో భేటీ అయ్యారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడంతో సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. ద్వైపాక్షిక రక్షణ సంబంధాలను విస్తరించుకోవాలని, అందుకు మార్గాలను అన్వేషించాలని ఇరువురు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న జనరల్ నకతాని పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.

ఉగ్రవాదంపై పోరుకు మద్దతిస్తామన్న పుతిన్

మరోవైపు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని మోడీకి ఫోన్ చేశారు. పహల్గాం దాడికి కుట్ర పన్నిన దుండగులను చట్టం ముందు నిలపాలన్నారు. ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని ఆటవికమైనదిగా పుతిన్ అభివర్ణించారని రష్యా రాయబార కార్యాలయం తెలియజేసింది. ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న పోరుకు పూర్తి మద్దతు ఇస్తామని పుతిన్ తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ దానిపై రాజీ లేని పోరాటం సాగించాల్సిన అవసరం ఉన్నదని పుతిన్, మోడీ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది భారత్‌లో జరిగే ఇరు దేశాల సదస్సుకు హాజరు కావాల్సిందిగా ప్రధాని కోరగా పుతిన్ అందుకు అంగీకరించారు.

కాల్పులకు తెగబడుతున్న పాక్ దళాలు

పాక్ సైనికులు వరుసగా 11వ రోజు కూడా నియంత్రణా రేఖ వెంబడి కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధర్, నౌషేరా, సుందర్‌బని, అఖ్నూర్ ప్రాంతాలలోని సైనిక పోస్టుల నుండి కాల్పులు జరిగాయి. భారత దళాలు దీటుగా స్పందించి వాటిని వెంటనే తిప్పికొట్టాయి. ఇదిలావుండగా తాము భారత్‌కు చెందిన అనేక రక్షణ వెబ్‌సైట్లపై దాడి చేశామని, వాటిలోని డేటాను దొంగిలించామని పాక్ హ్యాకర్లు చెప్పుకున్నారు. దీనిపై కేంద్రం విచారణకు ఆదేశించింది.

పాకిస్తాన్ పౌర, సైనిక నాయకత్వం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భారత్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను వివరించింది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని తెహ్రీక్-ఐ-ఇన్సాఫ్ మినహా మిగిలిన రాజకీయ పార్టీలన్నీ ఈ సమావేశానికి హాజరయ్యాయి. ఒకవేళ భారత్ దుస్సాహసానికి పాల్పడితే తగిన విధంగా జవాబు చెప్పాలని ఆ పార్టీలు అభిప్రాయపడ్డాయి.

భావ ప్రకటనా స్వేచ్ఛ ముసుగులో వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలా?

- ఆ ఐదుగురు కోర్టుకు హాజరు కావాలని సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : వికలాంగులపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిందుకు కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఐదుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లను సుప్రీం కోర్టు సోమవారం కోరింది. వీరిలో ఇండియాస్ గాట్ లాటెంట్ హోస్ట్ సమయ్ రైనా కూడా వున్నారు. వెన్నెముకకు సంబంధించి అత్యంత అరుదైన వైకల్యం (ఎస్‌ఎంఎ)తో బాధపడుతున్న వ్యక్తులను ఉద్దేశించి అపహాస్యం చేస్తూ వారు వారి షోలో వ్యాఖ్యలు చేశారని ఎన్‌జిఒ 'క్యూర్ ఎస్‌ఎంఎ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' పిటిషన్ దాఖలు చేసింది. దానిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. వారందరూ కోర్టుకు హాజరయ్యేలా నోటీసులు జారీ చేయాలని ముంబయి పోలీసు కమిషనర్‌ను కోరింది. లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పేర్కొంది. వికలాంగులు, అత్యంత అరుదైన వ్యాధులు, సమస్యలతో బాధపడుతున్న వారికి సంబంధించిన సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని క్రమబద్ధీకరించడంపై ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలంటూ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి బెంచ్ సూచించింది. అటువంటి వైకల్యంతో బాధపడుతున్న వారిని ఇలా అపఖ్యాతి పాల్జేయడమంటే వారిని నైతికంగా దెబ్బతీయడమేనని బెంచ్ వ్యాఖ్యానించింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని స్పష్టం చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు ముసుగులో ఇలాంటి వ్యాఖ్యలను అనుమతించలేమని పేర్కొంది. ఇటువంటి వాటికి సంబంధించి సోషల్ మీడియా కంటెంట్ విషయంలో మార్గదర్శకాలు రూపొందించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతమున్న చట్టంలో ఇందుకు సంబంధించి లొసుగులు వున్నాయని, అందువల్ల ఆన్‌లైన్ కంటెంట్‌పై మార్గనిర్దేశకాలు అవసరమని ఎన్‌జిఒ పేర్కొంది.

హర్యానాకు చుక్క నీరు కూడా ఇవ్వం

- పంజాబ్ అసెంబ్లీలో తీర్మానం

చండీగఢ్ : హర్యానాతో నీటి పంపకాలపై విబేధాల వేళ పంజాబ్ అసెంబ్లీలో ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం కీలకమైన ఒక తీర్మానం ప్రవేశపెట్టింది. తన వాటా నీటి నుంచి హర్యానాకు ఒక్క చుక్క నీటిని కూడా ఇవ్వమని తీర్మానంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో పంజాబ్ జలవనరుల శాఖ మంత్రి బరీందర్ కుమార్ గోయల్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి తీర్మానం చదువుతూ భాక్రా భియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు (బిబిఎంబి) ద్వారా హర్యానా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు పంజాబ్ హక్కులను హరించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన రీతిలో బిబిఎంబి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పంజాబ్‌కు హక్కుగా రావాల్సిన నీటిని హర్యానాకు బలవంతంగా తరలించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. మార్చి 31 వరకూ కూడా హర్యానా తన వాటా నీటిని పూర్తిగా వినియోగించుకుందని, అయినా సరే బిజెపి ఇంకా హర్యానాకు నీటిని ఇవ్వాలని కోరుకుంటుందని తీర్మానంలో విమర్శించారు. హర్యానా జనాభా 3 కోట్లు, దాని తాగునీరు, ఇతర అవసరాలు తీర్చడానికి 1,700 క్యూసెక్కుల నీరు మాత్రమే అవసరమని కానీ, ఇప్పుడు హర్యానా ఆకస్మాత్తుగా 8,500 క్యూసెక్కుల నీరు అవసరమని చెబుతోందని, ఈ మేరకు బిబిఎంబి సమావేశంలో తీర్మానం కూడా ఆమోదించారని మంత్రి విమర్శించారు. 'ఇది మాకు ఆమోదయోగ్యం కాదు' అని తెలిపారు.

మొత్తంగా ఆక్రమించుకుందాం!

- నిరవధికంగా తిష్ట వేద్దాం
- గాజాపై కొత్త ప్రణాళికకు ఇజ్రాయిల్ కేబినెట్ పచ్చజెండా

టెల్ అవీవ్ : గాజా కొత్త ప్రణాళికకు సోమవారం ఇజ్రాయిల్ కేబినెట్ పచ్చ జెండా వూపింది. గాజా ప్రాంతాన్ని మొత్తంగా ఆక్రమించేసుకోవడానికి, ఎంత కాలమైనా అక్కడే తిష్ట వేయడానికి మంత్రులందరూ ఆమోద ముద్ర వేశారని ఇజ్రాయిల్ అధికారులు తెలిపారు. ఈ ప్రణాళికను అమలు చేసినట్లైతే పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ తన సైనిక కార్యకలాపాలను అపారంగా విస్తరిస్తుంది. దీనికి అంతర్జాతీయంగా కూడా తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు వున్నాయి. సోమవారం ఉదయమే జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రణాళికకు మంత్రులందరూ ఆమోదముద్ర వేశారు. అంతకు కొద్ది గంటలు ముందే వేలాదిగా రిజర్వ్ సైనికులను హాజరు కావాల్సిందిగా ఆర్మీ పిలుపిచ్చినట్లు ఇజ్రాయిల్ మిలటరీ చీఫ్ తెలిపారు. హమాస్‌ను ఓడించి, గాజాలోని బందీలందరినీ విడిపించాలన్నది ఇజ్రాయిల్ యుద్ధ లక్ష్యాలుగా వున్నాయి. కొత్త ప్రణాళికను అమలు చేయడం వల్ల వందలు వేల సంఖ్యలో పాలస్తీనియన్లను దక్షిణ గాజాకు తరలిస్తారు. దీనివల్ల ఇప్పటికే తీవ్రంగా వున్న మానవతా సంక్షోభం మరింత పెచ్చరిల్లే ప్రమాదముందని భావిస్తున్నారు.

సాయానికి కొత్త ప్లాన్

మార్చి మధ్యలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ భీకరంగా దాడులకు తెగబడింది. దాదాపు 50శాతం భూభాగాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. గాజాలోకి మానవతా సాయాన్ని రాకుండా నిలిపివేసింది. మానవతా సాయాన్ని అందిస్తుంటే గాజాలో హమాస్ పట్టు ఇంకా కొనసాగుతునే వుంటుందని, అదే హమాస్ కాకుండా ప్రైవేట్ సెక్యూరిటీ కంపెనీలను ఉపయోగించి మానవతా సాయాన్ని పంపిణీ చేయిస్తే ప్రజల్లో పట్టు తగ్గుతుందని భావిస్తున్నట్లు ఇజ్రాయిల్ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని ఐక్యరాజ్య సమితికి ఇజ్రాయిల్ తెలియజేసిందని కేబినెట్ ఇంటర్నల్ మెమో తెలిపింది. గాజాలో ఆహార సమన్వయ వ్యవహారాలు చూసే ఇజ్రాయిల్ రక్షణ సంస్థ ఇన్‌చార్జి, ఐక్యరాజ్య సమితి అధికారుల మధ్య జరిగిన సమావేశపు వివరాలను తెలియజేస్తూ ఆదివారం సహాయ సంస్థలకు ఒక మెమో కూడా పంపారు. ఈ సాయం ఎప్పుడు అందజేస్తారు, ఎలా అందుతుందనే వివరాలను ఆ మెమోలో పేర్కొనలేదు. గాజాలో తమ ప్రణాళికను నెమ్మదిగా అమలు చేయడమే ఇజ్రాయిల్ లక్ష్యమని స్పష్టం చేసింది.

ఎస్‌కెఎం నేతల గృహ నిర్బంధం

- ప్రభుత్వం భయపడుతోంది : ఎస్‌కెఎం నేత దల్లెవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లో అనేక మంది సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారని రైతు నాయకులు విమర్శించారు. శంభు పోలీస్ స్టేషన్ వెలుపల తమ నిరసనకు ముందే ఎస్‌కెఎం నేత జగ్జిత్ సింగ్ దల్లెవాల్ సహా అనేక మంది నాయకులను పంజాబ్ ప్రభుత్వం సోమవారం గృహ నిర్బంధంలో ఉంచిందని రైతు నాయకులు పేర్కొన్నారు. శంభు, ఖనౌరి ప్రాంతాల్లో రైతుల ఆందోళన జరగకుండా అణచివేత పద్ధతులను ఉపయోగించారని ఆరోపిస్తూ పంజాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మే 6 (మంగళవారం)న ఎస్‌కెఎం ఆందోళనకు పిలుపునిచ్చింది. పంజాబ్ పోలీసులు సోమవారం తెల్లవారుజామున ఎస్‌కెఎం నేతల ఇళ్లకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారని రైతు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆందోళన కోసం ప్రజలను సమీకరించకుండా పోలీసులు వారిని నిరోధించాలనుకుంటున్నారని విమర్శించారు. 'ఫరీద్‌కోట్ జిల్లాలోని తన ఇంట్లో తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో దల్లెవాల్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు' అని ఒక రైతు నాయకుడు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అనేక మంది రైతు నాయకులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో మంజిత్ సింగ్ రాయ్, దవీందర్ సింగ్ లాంటి రైతు నేతలు ఉన్నారు.

రైతుల ఆందోళనల నుండి తమను వెళ్లగొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అణచివేత పద్ధతులను ఉపయోగించిందని, రైతులను ఇళ్లకు వెళ్ళగొట్టినప్పుడు వారి వస్తువులను దొంగిలించారని ఎస్‌కెఎం విమర్శించింది. రైతుల వస్తువులను దొంగిలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ అణచివేత పద్ధతులను వ్యతిరేకిస్తూ, రైతుల వస్తువుల దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం శంభు పోలీస్ స్టేషన్ వెలుపల శాంతియుత ఆందోళన చేపట్టనున్నట్లు ఎస్‌కెఎం ఇటీవల ప్రకటించింది. అయితే ఈ ఆందోళనను అణచివేసేందుకు పంజాబ్ ప్రభుత్వం రైతు నేతలను గృహ నిర్బంధం విధించింది.



ఈ సందర్భంగా దల్లెవాల్ సోషల్ మీడియాలో ఒక వీడియోను అప్‌లోడ్ చేశారు. 'నేను ఇప్పటికీ బలహీనంగా ఉన్నాను. ఇప్పుడు కూడా నేను నడవలేను. అయినప్పటికీ పోలీసులు నన్ను నా ఇంటికి పరిమితం చేశారు' అని దల్లెవాల్ అన్నారు. రైతులు శంభు పోలీస్ స్టేషన్ వెలుపల ఒకరోజు శాంతియుత నిరసనను ప్రకటించారని, కానీ ప్రభుత్వం 'భయపడి' వారిని అనుమతించడం లేదని దుయ్యబట్టారు.

గతంలో చాలా మంది రైతు నాయకులు, రైతులకు భారీ నష్టం వాటిల్లిందని, ఎందుకంటే వారి ట్రాలీలు, ఇతర వస్తువులు శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద దొంగిలించబడ్డాయని అన్నారు. కోల్పోయిన వస్తువులను రైతులు తిరిగి పొందలేదని పేర్కొన్నారు. రైతుల వస్తువులు దొంగతనానికి గురైనందున పరిహారం చెల్లిస్తామని రాష్ట్ర పోలీసులు హామీ ఇచ్చారని, కానీ అమలు చేయలేదని దల్లెవాల్ విమర్శించారు. 'నిందితులపై సత్వర చర్యలు తీసుకునే బదులు, చోరీకి గురైన రైతుల వస్తువులను గుర్తించడంలో సహాయం చేస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. మే 6న మేము నిరసనకు పిలుపునిచ్చినప్పుడు, ప్రభుత్వం చాలా భయపడి మమ్మల్ని అక్కడకు చేరకుండా అడ్డుకోవాలని నిర్ణయించుకుంది' అని దల్లెవాల్ విమర్శించారు.


రాహుల్‌గాంధీ పౌరసత్వ పిటిషన్ కొట్టివేత

- అలహాబాద్ హైకోర్టు


న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ సోమవారం కొట్టివేసింది. ఈ కేసుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని విచారణ సందర్భంగా లక్నో బెంచ్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం కేసును కొట్టివేసింది. రాహుల్ గాంధీ భారతదేశం, బ్రిటన్ పౌరసత్వాలను కలిగి ఉన్నారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 84 (ఎ) ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడంటూ కర్ణాటకకు చెందిన బిజెపి కార్యకర్త విఘ్నేష్ శిశిర్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. గత విచారణలో రాహుల్ గాంధీ భారతీయ పౌరుడా? కాదా? అనే విషయంపై హోం మంత్రిత్వశాఖ సమర్పించిన నివేదిక పట్ల కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. రాహుల్‌గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పష్టమైన సమాధానమివ్వాలని.. సవరించిన నివేదిక సమర్పించడానికి కోర్టు ప్రభుత్వానికి 10 రోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే.

స్కైప్ సేవలు నిలిపివేత

శాన్‌ఫ్రాన్సిస్కో : ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు చెందిన వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫామ్ స్కైప్ సేవలు సోమవారం నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. జూమ్ మీటింగ్స్, వాట్సప్ కాల్స్ రాకముందు దేశ, విదేశాల్లోని వారు ఆన్‌లైన్ సమావేశాలకు స్కైప్‌ను ఉపయోగించేవారు. 2003లో స్కైప్ టెక్నాలజీస్ దీన్ని ప్రారంభించగా.. 2011లో మైక్రోసాఫ్ట్ స్వాధీనం చేసుకుంది. 2008లో రికార్డ్ స్థాయిలో 40 కోట్ల మంది యూజర్లుండగా.. క్రమంగా వినియోగదారులను కోల్పోయింది. ఇప్పటికీ ఆ సంస్థకు 2.3 కోట్ల మంది వినియోగదారులున్నారు. ముఖ్యంగా కోవిడ్ కాలంలో జూమ్, వాట్సాప్‌లకు పోటీనివ్వలేకపోయింది. మైక్రోసాఫ్ట్ సంస్థ కూడా టీమ్స్‌కు ఇచ్చిన ప్రాధాన్యత స్కైప్‌కు ఇవ్వకపోడంతోనూ ప్రభావం కోల్పోయింది.



ఫోను వద్దు



మంగాపురం అనే గ్రామంలో రామయ్య, లచ్చువ్వ అనే దంపతులు ఉన్నారు. వారి ఒక్కగానొక్క కొడుకు రాజేష్.. ఒక్కడే కొడుకు అయినందున చాలా గారాబంగా చూసుకునేవారు. అమ్మానాన్నల అతి గారాబంతో రాజేష్ పెంకిగా తయారయ్యాడు.

ఒకరోజు రాజేష్ వాళ్ళ స్నేహితుడికి ఫోన్ ఉందని తెలిసి తనకి కూడా కావాలని మంకుపట్టు పట్టాడు. అమ్మానాన్న ఎంత చెప్పినా వినకుండా అన్నం తినడం మానేశాడు. స్కూల్‌కి కూడా వెళ్లనని మారాం చేశాడు. ఇంక చేసేది ఏమీ లేక ఒక ఫోన్ కొనిస్తారు. రాజేష్ చాలా సంతోషపడ్డాడు. అలా కొన్ని రోజులు గడిచాయి. ఇంతకుముందులా రాజేష్ అమ్మానాన్నతో మాట్లాడడం మానేశాడు. ఫోన్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నాడు. అలా వద్దని ఎంత చెప్పినా వినలేదు. చదువును కూడా నిర్లక్ష్యం చేశాడు.



ఒకరోజు స్కూల్‌కి వెళ్లకుండా ఫోన్లోనే మునిగిపోవడంతో వాళ్ళ అమ్మ కోప్పడింది. రాజేష్ వెనుకా ముందు చూడకుండా అమ్మపై బాగా కోప్పడతాడు. నాన్న వచ్చాక అమ్మ మీద ఫిర్యాదు చేస్తాడు. పిల్లాడు ఫోనుపై చూపిస్తున్న శ్రద్ధ చదువుపై చూపించడం లేదని, ఇంతకుముందులా ఎవరితో మాట్లాడడం లేదని రామయ్య కొన్ని రోజులుగా గమనిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు అమ్మ మీద ఫిర్యాదు చేసేంతలా రాజేష్ దిగజారాడని అర్థం చేసుకున్నాడు.

'ఇప్పటికే చాలా సమయం మించిపోయింది. ఇకనైనా ఫోను నుండి రాజేష్‌ని దూరం చేయాలనుకున్నాడు. రాజేష్ మాట విన్నట్లుగా నటించి, లచ్చువ్వని విపరీతంగా తిట్టాడు. లచ్చువ్వ ఏడుస్తూ కూర్చొంది. అప్పుడు రామయ్య, రాజేష్‌ని పిలిచి, 'చూడు నాన్నా అమ్మ ఎలా ఏడుస్తుందో! నీవల్లే నేను అమ్మని తిట్టాను. అమ్మ ఏం చేసింది? నిన్ను ఫోను చూడొద్దని చెప్పింది. అంతేకదా! నువ్వు ఫోను చూడడం వల్ల అమ్మతో సరిగ్గా మాట్లాడడం లేదు. తనతో ఇంతకుముందులా లేవు. రోజూ నాతో చెప్పి ఎంతో బాధపడుతోంది. అమ్మని ఇంతలా నువ్వు ఎందుకు బాధపెడుతున్నావు. నీకు అమ్మ కంటే ఫోనే ముఖ్యమైందా!' అని నిదానంగా చెప్పాడు. నాన్న మాటలతో రాజేష్ తన తప్పు తెలుసుకున్నాడు. 'ఇక నుండి నేను ఫోను చూడను నాన్న. అమ్మపై ఎప్పుడూ కోపం తెచ్చుకోను' అని ఏడుస్తూ చెప్పాడు. కొడుకులో వచ్చిన మార్పుకు రామయ్య, లచ్చువ ఎంతో సంతోషపడ్డారు.



- చీర్నపల్లి నవిత,
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.



ఎండాకాలం


ఎండాకాలం సెలవులు వచ్చాయి మాకు
సెలవులతో సంతోషం వేసింది మాకు
ఆటలు ఆడితే ఎండకొడుతుంది మాకు
ఎండతగిలితే వడదెబ్బ కొడుతుంది మాకు
ఈతకొడితే జలుబు చేసింది మాకు
ఐస్ క్రీమ్ తింటే తిట్లు అవుతున్నాయి మాకు
చెట్లపై ఆడితే చీమలు కుడుతున్నాయి మాకు
పండ్లు తెంపితే తేనెటీగలు కుట్టాయి మాకు
సెల్ చూస్తే నాన్నతో దెబ్బలు పడ్డాయి మాకు
టి.వి. చూస్తే అమ్మతో చీవాట్లు పడ్డాయి మాకు
అందుకే మళ్లీ బడి ఉండాలనిపించింది మాకు.





ఎ.రాహుల్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహులపల్లి పల్లి,
పెద్దపల్లి జిల్లా.

బొమ్మల కొలువు



రామ్‌చరణ్ రెడ్డి,
5వ తరగతి,
ఎస్‌ఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్,
గుజ్జనగుండ్ల,
గుంటూరుజిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com వాట్సాప్ : 83329 25496

జీవన సౌరభం

నిర్లక్ష్యం చేయడం వల్ల కోల్పోయిన అవకాశం జీవితకాలం వేచి ఉన్నా దక్కకపోవచ్చు.

JEEVANA
జీవన the family

ఎండల్లో పిల్లల సంరక్షణ

వేసవి కాలంలో వేడి, తేమ, ధూళి, కాలుష్యం వంటి సమస్యల వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకుంటే పిల్లలను వేసవి కారకాల నుండి రక్షించుకోవచ్చు.

- ఈ కాలంలో పిల్లలకు చిరాకు పెట్టించే పాపులర్ పాలిస్టర్ బట్టలు కాకుండా, తేలికగా ఉండే కాటన్ దుస్తులను వేయడం మంచిది. ఇవి శరీరానికి తేమను కలిగించవు.
- ఒకవేళ పిల్లలు బయటకు వెళ్లే అవసరం వస్తే ఎండ, దోమలు, ఇతర కీటకాల నుంచి కాపాడేందుకు లోషన్స్ వాడాలి.
- వేసవిలో చెమట ఎక్కువగా రావడం వల్ల చర్మ సమస్యలు కనిపిస్తాయి. వీటిని నివారించేందుకు సహజమైన నేచురల్ రెమిడీస్, సన్‌స్క్రీన్ లోషన్‌లు, మాయిశ్చరైజర్‌లు ఉపయోగించాలి.
- సెలవుల్లో పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ తింటారు. ఇంకా కార్బొనేటెడ్ డ్రింక్స్ తీసుకుంటారు. ఇది గ్యాస్, కడుపునొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలకు దారితీస్తుంది. వీటిని నివారించేందుకు శుభ్రమైన, ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని అందించాలి.
- బయట ఆడి ఇంటికి వచ్చిన వెంటనే చేతులు కడుక్కోవడం అలవాటు చేయాలి.
- ఆటల్లో మునిగిపోయే పిల్లలు ఎక్కువగా నీరు తాగడం మరిచిపోతారు. దీని వల్ల డీహైడ్రేషన్‌కి లోనవుతారు. కాబట్టి వారిని తరచూ నీరు తాగమని చెప్పాలి. అలాగే పండ్ల రసాలు, నారింజ జ్యూస్ వంటి హైడ్రేటింగ్ పానీయాలు ఇవ్వాలి.
- సెలవుల్లో పిల్లలు స్నాక్స్‌కు అలవాటు పడిపోతారు. దీంతో వారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్ సలాడ్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను ఇంట్లోనే తయారుచేసి ఇవ్వాలి.
- వేసవి తాపం తీవ్రమవుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో పిల్లలను బయటకు పంపకుండా చూడాలి. అవసరమైతే మాత్రమే, అది కూడా ఉదయం లేదా సాయంత్రం చల్లగా ఉన్న సమయంలోనే బయటకు పంపాలి.



- సూర్యుని నుండి వచ్చే ప్రమాదకర కిరణాలు, గాలిలో కలిసిన కాలుష్య కారణాలు పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు. వీటిని నివారించేందుకు ఇంటిలో శుభ్రత పాటించాలి, అవసరమైతే మాస్కులు వాడించాలి.

మల్లెలు.. ఉపయోగాలు

ప్రకృతిలో దొరికే అందమైన పూలలో మల్లెపూలకు ప్రత్యేక స్థానం ఉంది. మల్లె పూలు ఇచ్చే పరిమళం ఎన్నో రోగాలను దూరం చేస్తుంది. వేసవిలో దొరికే ఈ మల్లెలను అందరూ ఉపయోగించొచ్చు.

- మల్లెపూలు మానసిక ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఈ మల్లెపూలను మెత్తగా నూరి తడిబట్టలో చుట్టి కళ్లమీద పెట్టుకుంటే కళ్లల్లో నీరు కారడం, తడి ఆరిపోవడం, కళ్ల మంటలు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మరోవైపు మల్లెపూల నుంచి తీసిన రసాన్ని ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.
- మధుమేహంతో బాధపడేవారు మల్లెపూలతో చేసిన కషాయం తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి.
- కొబ్బరినూనెలో నానబెట్టిన మల్లెపూల నుంచి వచ్చిన రసాన్ని తలకు రాసుకుంటే జుట్టు కుదుళ్ల గట్టిపడతాయి. దీనికోసం గుప్పెడు మల్లెపూలను వేసి ఒకరోజంతా నానబెట్టాలి. ఆ నీటిని కాచి వడగట్టాలి. చల్లారాక తలకు మర్దన చేసుకోవాలి.
- మల్లెపూలను తల దిండు పక్కనే పెట్టుకుని నిద్రిస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుంది.
- ఈ పువ్వుల్లో ఉండే కాటెచిన్స్ ఆక్సీకరణ ప్రక్రియని నిరోధిస్తుంది. దీని వలన ఒత్తిడి, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి.
- మల్లె పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక స్థాయిలో ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తొలగించడానికి సహాయపడతాయి.
- వీటితోచేసిన కషాయం తాగితే ఇందులో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉపిరితిత్తుల కాన్సర్, రొమ్ము కాన్సర్, చర్మ కాన్సర్, మూత్రాశయ క్యాన్సర్ కారకాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది.



ఎండు ఖర్జూరంతో ఆరోగ్యం

ఎండకు ఎన్ని నీళ్లు తాగినా...చెమట రూపంలో ఎన్నో లవణాలు బయటకు పోయి నీరసం వస్తుంది. అదే రోజుకు నాలుగు, ఐదు ఎండు ఖర్జూరం తింటే పోయిన లవణాలు తిరిగి వస్తాయి. దీనిలో అనేక పోషకాలు ఉన్నాయి. ఖర్జూరంలో వివిధ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.



- కొలెస్ట్రాల్‌ను తగ్గించి బరువును నియంత్రించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. ఇవి రక్త కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది కంటి సంబంధిత రుగ్మతల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.
- ఖర్జూరంలో ఫ్లేవనాయిడ్స్ ఉన్నాయి. ఇవి మధుమేహం, అల్జీమర్స్ వ్యాధి, కొన్ని రకాల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.
- ఖర్జూరంలో రాగి, సెలీనియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముక సంబంధిత రుగ్మతలను నివారిస్తుంది.
- ఖర్జూరంలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.
- ఖర్జూరంలో కోలిన్, విటమిన్ బి ఉన్నాయి. ఇది గ్రహణశక్తి, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా అల్జీమర్స్ వ్యాధి ఉన్న వారు వీటిని తింటే మంచి ఫలితం ఉంటుంది.

దాసరి పేరుతో ఉత్తమ డైరెక్టర్ అవార్డులివ్వాలి



తెలుగు సినిమా చరిత్రలో శతాధిక చిత్రాలు తెరకెక్కించిన తొలి దర్శకునిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్న దర్శకరత్న దాసరి నారాయణ రావు పేరు మీదుగా ఉత్తమ డైరెక్టర్ అవార్డును ప్రకటించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి జెవి మోహన్‌గౌడ్, సినిమారంగ ప్రముఖులు, మాజీ అధ్యక్షులు అంబటి మధుమోహనకృష్ణ కోరారు. తెలుగు చిత్ర దర్శకరత్న దాసరి నారాయణరావు 78వ పుట్టినరోజు వేడుకలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. అమరావతిలోని ఎపి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మోహన్ గౌడ్, మధుమోహనకృష్ణ మాట్లాడారు. తెలుగు సినీ పరిశ్రమ వైభవానికి దాసరి ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చిన తర్వాత నిలదొక్కుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. కోశాధికారి ఎం.శ్రీనాథరావు, కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్ ఠాగూర్, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పిచ్చిరెడ్డి, ఛాంబర్ సభ్యులు పరిటాల రాంబాబు, అమ్మా రమేష్, బిగ్‌బ్యాంగ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో ఎపి ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ జిల్లా కోఆర్డినేటర్ సాయిపవన్ సుంకర, భువనేశ్వరి ఫిలిం స్టూడియోస్ తరపున నిర్మాత భువన, నరసింహులు, దేవాప్రశాంత్, రామకృష్ణారెడ్డి, నాగ మునీంద్ర, పరుచూరి భవానీ రవిశంకర్, మహిళా ప్రతినిధి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ఒన్‌టౌన్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఎపి ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎపిమా) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నటులు పిల్లా ప్రసాద్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకరన్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, కళారంగ ప్రముఖులు గోళ్ల నారాయణరావు తదితరులు మాట్లాడారు. తోరం రాజా, వీరంకి వెంకట నరసింహారావు, పోలుదాసు రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాత రామారావు కన్నుమూత

టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత జవాజి వెంకట రామారావు (68) (అలియాస్ తేనెటీగ రామారావు) ఆదివారంనాడు హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా ఆయన కాలేయ సంబంధిత సమస్యతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1990లో నరేష్, రాజేంద్రప్రసాద్ తదితర కథానాయకులతో ఆయన ఎక్కువగా సినిమాలు తీశారు. రాజేంద్రప్రసాద్‌తో తేనెటీగ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఆయనను అదే పేరుతో పిలుస్తారు. వంశీ దర్శకత్వంలో నరేష్-వాణీవిశ్వనాథ్‌లతో ప్రేమ అండ్ కో, శివకృష్ణతో బొబ్బిలి వేట, బడి వంటి సినిమాలను నిర్మించారు. కొన్ని డబ్బింగ్ చిత్రాలను కూడా ఆయన తెలుగులో విడుదల చేశారు. రామారావు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న పలువురు సినీ రంగ ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో 'లెనిన్'



మురళీకిషోర్ అబ్బూరి దర్శకత్వంలో అఖిల్ అక్కినేని హీరోగా 'లెనిన్' అనే సినిమా తెరకెక్కుతోంది. రాయలసీమ నేపథ్యంలో సాగే ఎమోషనల్ ప్రేమకథగా ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో అఖిల్ చిత్తూరు కుర్రాడిగా కనిపిస్తారు. శ్రీలీల ఇందులో కథానాయిక. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ చాలా వరకూ పూర్తయింది. వచ్చే వారం నుంచి ఇంటర్వెల్ సీక్వెన్స్‌ని షూట్ చేయనున్నారు. ఈ సీక్వెన్స్ కోసం అన్నపూర్ణ స్టూడియోలో ప్రత్యేకమైన సెట్ నిర్మిస్తున్నారు. దసరా కానుకగా సినిమా విడుదల కానుంది. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రానికి నిర్మాతలు.

చిన్న థియేటర్లు నిర్మిద్దాం : బల్వంత్‌సింగ్



'చిన్న థియేటర్లు నిర్మించుకోవటం ద్వారానే సినిమా రంగాన్ని బతికించుకోగలం. వ్యాపార దృక్పథంతో కాకుండా సినిమా రంగాన్ని బతికించుకోవాలనే తపనతో ఎన్నో ఏళ్లుగా ఇలాంటి కృషిచేస్తున్నాను. నగరాలు, పట్టణాల నడిబొడ్డున ఉన్న థియేటర్లు వ్యాపార సముదాయాలుగాను, కళ్యాణ మండపాలుగా మారిపోతున్నాయి. జనాభా విస్తరణకు అనుగుణంగా అందరికీ అందుబాటులో ఉండేలా చిన్న థియేటర్లు లేవు. నిర్మితం కావాలి. ఇప్పటికైనా సినీరంగ పెద్దలు ఈ విషయమై శ్రద్ధ తీసుకుని కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నా' అని బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ సినీరంగ ప్రముఖులు బల్వంత్‌సింగ్ కోరారు. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్‌లో బాలీవుడ్ సూపర్ స్టార్స్ అమీర్‌ఖాన్, షారూక్‌ఖాన్ కూడా మాట్లాడుతూ 'థియేటర్లు పెంచుకోకపోతే సినిమారంగం మెల్లగా చచ్చుపడిపోవడం ఖాయం..సూపర్‌డూపర్ హిట్టయిన సినిమాలను సైతం మన దేశ జనాభాలో రెండు శాతం మంది మాత్రమే చూస్తున్నారు. ప్రేక్షకులకు థియేటర్లు అందుబాటులో లేకపోవటమే కారణం' అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. తాజాగా బల్వంత్‌సింగ్ వారి ప్రసంగాన్ని స్వాగతిస్తూ తాను కూడా సినిమా పరిశ్రమ బాగుపడాలనే సదాశయంతో పనిచేస్తున్నానని వివరించారు.

సన్‌రైజర్స్‌కు వర్షం దెబ్బ

- హైదరాబాద్ ఇన్నింగ్స్‌కు అడ్డంకి
- ఇరుజట్లకు చెరో పాయింట్
- ఢిల్లీ క్యాపిటల్స్ 133/7



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఢిల్లీని కట్టడి చేసి మరో విజయానికి దగ్గరైందనుకున్న అభిమానుల ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఢిల్లీ నిర్దేశించిన 134 స్వల్ప లక్ష్యం ఛేదించడం సులువే.. సన్‌రైజర్స్ ఖాతాలో మరో గెలుపు ఖాయం అనుకున్న దశలో హైదరాబాద్‌ను భారీ వర్షం ముంచెత్తింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ముగిసిందో లేదో చినుకులు మొదలయ్యాయి. ఆ చినుకులు కాస్తా భారీ వర్షంగా మారి మైదానాన్ని చిత్తడిగా చేసింది. వర్షం నిలిచాక పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు.. ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా ఉన్న కారణంగా రాత్రి 11 గంటల సమయంలో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
బెంగళూరు	11	8	3	0	16	+0.48
పంజాబ్	11	7	3	1	15	+0.37
ముంబయి	11	7	4	0	14	+1.27
గుజరాత్	10	7	3	0	14	+0.86
ఢిల్లీ	11	6	4	1	13	+0.36
కోల్‌కతా	11	5	5	1	11	+0.24
లక్నో	11	5	6	0	10	-0.46
సన్‌రైజర్స్	11	3	7	1	7	-1.19
రాజస్తాన్	12	3	9	0	6	-0.71
చెన్నై	11	2	9	0	4	-1.11

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

నిప్పులు చెరిగిన కమిన్స్

సొంత గడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో చెలరేగాడు. తొలి బంతికే కరణ్ నాయర్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాత డుప్లెసిస్, అభిషేక్ పోరెల్‌ను ఔట్‌చేసి ఢిల్లీ క్యాపిటల్స్ నడ్డి విరిచాడు. కమిన్స్‌కి తోడు ఉనాద్కట్(1/13) ఫామ్‌లో ఉన్న డేంజరస్ బ్యాటర్ కేఎల్ రాహుల్(10)ను ఔట్ చేసి ఢిల్లీని పీకల్లోతు కష్టాల్లో నెట్టాడు. కెప్టెన్ అక్షర్ పటేల్‌తో పాటు విప్‌రాజ్ నిగమ్‌ను కూడా త్వరగా పెవీలియన్‌కు పంపడంతో ఢిల్లీ 62 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి మరింత కష్టాల్లోకి నెట్టారు. ఆ దశలో ట్రిస్టన్ స్టబ్స్(41 నాటౌట్) ఇంపాక్ట్ ప్లేయర్ అశుతోష్ శర్మ(41)లు ఢిల్లీని ఆదుకున్నారు. వీరు ఏడో వికెట్‌కు వీరు 66 పరుగులు జోడించారు. మలింగ వేసిన 20వ ఓవర్లో స్టబ్స్ ఫోర్ బాది ఢిల్లీ స్కోర్‌ను 133 పరుగులకు చేర్చాడు. ఉనాద్కట్, హర్షల్ పటేల్, ఈషన్ మలింగకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: కరణ్ నాయర్ (సి)ఇషాన్ కిషన్ (బి)కమిన్స్ 0, డుప్లెసిస్ (సి)ఇషాన్ కిషన్ (బి)కమిన్స్ 3, అభిషేక్ పోరెల్ (సి)ఇషాన్ కిషన్ (బి)కమిన్స్ 8, కెఎల్ రాహుల్ (సి)ఇషాన్ కిషన్ (బి)ఉనాద్కట్ 10, అక్షర్ పటేల్ (సి)కమిన్స్ (బి)హర్షల్ పటేల్ 6, స్టబ్స్ (నాటౌట్) 41, విప్‌రాజ్ నిగమ్ (రనౌట్) అంకిత్ వర్మ (బి)అన్సారి 18, అశుతోష్ శర్మ (సి)అభినవ్ మనోహర్ (బి)ఇషాన్ మలింగ 41, స్టార్క్ (నాటౌట్) 1, అదనం 5(20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 133పరుగులు.
వికెట్ల పతనం: 1/0, 2/6, 3/15, 4/26, 5/29, 6/62, 7/128 **బౌలింగ్:** కమిన్స్ 4-0-19-3, ఉనాద్కట్ 4-0-13-1, హర్షల్ 4-0-36-1, ఇషన్ 4-0-28-1, జీషన్ 3-0-30-0, అభిషేక్ 1-0-5-0.

ఐపిఎల్‌లో నేడు
ముంబయి ఇండియన్స్ X గుజరాత్ టైటాన్స్
వేదిక: ముంబయి; రాత్రి 7.30గం॥లకు

రబడకు లైన్ క్లియర్



అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్‌కు ఊరట లభించింది. 18వ సీజన్‌లో ఆడేందుకు కగిసో రబడకు లైన్ క్లియర్ అయింది. దక్షిణాఫ్రికా క్రికెట్‌బోర్డు 'డ్రగ్ ఫ్రీ స్పోర్ట్స్' క్లీన్‌చిట్ ఇచ్చింది. రెండు సెషన్ల కౌన్సిలింగ్ పూర్తికావడంతో అతడిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. దాంతో, నిషేధం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన రబడ త్వరలోనే గుజరాత్ జట్టుతో కలువనున్నాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ పేస్ దళం ప్రసిధ్, సిరాజ్, ఇషాంత్‌లతో పాటు రబడా చేరికతో మరింత పటిష్ఠంగా తయారైంది. జనవరి 21న కేప్‌టౌన్, డర్బన్ సూపర్ జెయింట్స్ మ్యాచ్ తర్వాత అతడికి డోప్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. అతడి రక్త నమూనాల్లో నిషేధిత డ్రగ్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే.. అప్పటికే ఐపీఎల్ 18వ సీజన్ కోసం రబడ భారత్‌కు వచ్చేశాడు. ఈ నిషేధం కారణంగా అతడు తిరిగి మళ్లీ దక్షిణాఫ్రికా వెళ్లిపోయిన విషయం తెలిసిందే.





మాడ్రిడ్ ఓపెన్ 2025 టైటిళ్లను అర్యానా సబలెంక(బెలారస్), కాస్పర్ రూఢ్(నార్వే) చేజిక్కించుకున్నారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో రూఢ్ 7-5, 3-6, 6-4తో 5వ సీడ్ డ్రాపర్(బ్రిటన్)ను, మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ అర్యానా సబలెంకా 6-3, 7-6(7-3)తో 4వ సీడ్ కోకా గాఫ్(అమెరికా)ను ఓడించారు. సబలెంక గతంలో 2023, 2021లలో చాంపియన్‌గా నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68